'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 43 | ఆదివారం | 27.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 43 | Sunday | 27.9.2026 | Pages: 8 | Rate: 2



## 20 వేల విగ్రహాలు.. ప్రశాంతంగా నిమజ్జనం!

**24 గంటలపాటు పహారా**

**పోలీసులతో కలిసి సీపీ సజ్జనార్ సంబరాలు**

హైదరాబాద్‌లో వినాయక నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. హుస్సేన్‌సాగర్‌లో నగరం, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ పరిధుల నుంచి వచ్చిన 20 వేలకు పైగా భారీ వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. 69 అడుగుల భారీ వినాయకుడి నిమజ్జనంతో ప్రారంభమైన ప్రధాన ఊరేగింపులో బాలాపూర్ గణేశుడి విగ్రహం కూడా పాల్గొంది. దాదాపు 24 గంటల పాటు పోలీసులు నిరంతరం విధుల్లో ఉండి ఊరేగింపులు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. (వివరాలు 2లో..)



## తెలంగాణ మరో మైలురాయి

**నిలిచిన ప్రాజెక్టుకు మళ్లీ ఊపిరి**

**యాదాద్రి ప్లాంట్ నుంచి 140 ఎంయూ లక్ష్యం**

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి రోజుకు సగటున 140 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే దిశగా తెలంగాణ జెన్‌కో కసరత్తు చేస్తోంది. 2017లో నిర్మాణం ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు కారణంగా నిలిచిపోయింది. పర్యావరణ అనుమతుల ప్రక్రియలో జాప్యంతో పనులు ముందుకు సాగలేదు. (వివరాలు 2లో..)

## మందు తాగిన కోతి

- **వోడ్కా కొట్టేసిన వానరం**
- **మత్తులో కార్టన్‌పై నిద్ర**

రాత్రి పూట షాపులోకి దొంగ చొరబడితే.. యజమాని గుండె దడ, సిబ్బంది పరుగులు, చివరకు పోలీసులకు ఫోన్.. ఇదే సాధారణంగా జరిగే కథ. కానీ రాంచీలోని ఓ మద్యం దుకాణంలో మాత్రం దొంగ వచ్చాడు.. దొంగతనం చేశాడు.. మద్యం కూడా తాగాడు.. చివరకు అక్కడే పడుకుని నిద్రపోయాడు! ఇంతకీ ఆ 'దొంగ' ఎవరంటే.. ఓ కోతి! ఓర్మాంఝీ చౌక్‌లోని మద్యం షాపులోకి హఠాత్తుగా దూసుకొచ్చిన కోతి మొదట బిస్కెట్లకు కూడా లొంగలేదు. షాపు సిబ్బంది బయటకు పంపేందుకు ప్రయత్నించినా.. అది మాత్రం తన టార్గెట్ మార్చలేదు. నేరుగా వోడ్కా బాటిల్‌ను ఎంచుకుని, పగులగొట్టి, సగం వరకు గుటకలేసింది. అంతే.. కాసేపటికే మత్తు తలకెక్కింది. ఏసీ గదిలో సౌకర్యవంతమైన బెడ్ కోసం వెతికినట్టుగా.. చివరకు మద్యం కార్టన్లనే మంచంగా మార్చుకుని హాయిగా నిద్రపోయింది. షాపులో ఉన్నవాళ్లు కూడా ఏం చేయాలో తెలియక నవ్వుకుంటూ మొబైల్ కెమెరాలు ఆన్ చేశారు. దొంగతనానికి వచ్చిన కోతి.. బాటిల్ కొట్టేసి, బిల్లుకూడా కట్టకుండా అక్కడే 'నిద్ర పిల్లులు' వేసుకున్న ఈ సీన్ ఇప్పుడు సోషల్ మీడియాలో నవ్వులు పూయిస్తోంది!



2లో..

## వద్దురా బాబు




2లో..

**వంటగదుల్లో కంపు.. ప్లేట్లలో కలకలం**

**బొద్దింకలు, ఎలుకలతో ఫుడ్ ఫైట్ • టీజీ సేఫ్ కొరడా.. 20 చోట్ల తనిఖీలు • 11 హోటళ్ల లైసెన్సులపై వేటు**

**సామాన్యుడి ఆకలి.. ఆరోగ్యానికి ముప్పు!**

వెలుగుల వెలుగుల్లో మెరిసిపోయే నగరపు గ్లామర్ అద్దాల వెనుక... మీరు ప్లేట్లలో లొట్టలేస్తూ తింటున్న ఆ పసందైన వంటకాలు నిజంగా ఆహారమేనా, లేక నెమ్మదిగా ప్రాణాలు తీసే విషపూరితమైన కాక్టెయిలా? ప్రతి నెలా వేల రూపాయలు ధారపోసి, నమ్మకంతో ఐటీ కారిడార్‌లోని లగ్జరీ రెస్టారెంట్లకు వెళ్తున్న సామాన్యుడి జేబులను దోచేస్తూ, మరోవైపు ఆరోగ్యాన్ని బలిపీఠంపై నిలబెడుతున్న బడా హోటళ్ల అసలు రంగు బయటపడింది! కంటికి కనిపించే కాంతుల వెనుక వంటగదుల్లో ఈగలు, కిటకిటలాడే బొద్దింకలు, సంచరించే ఎలుకల మలమూత్రాల మధ్య, కుళ్ళిపోయిన మాంసం, కాలం చెల్లిన నకిలీ పదార్థాలతో తయారుచేస్తున్న ఆ తినుబండారాలు మీ కడుపులోకి ఎలా వెళ్తున్నాయో తెలిస్తే మీ గుండె ఘల్లుమనాల్సిందే! పైకి పసందైన రుచులు... లోపల కంపిస్తున్న మురికి కూపాలు! మీ ప్రాణాలతో చెలగాటమాడుతూ కోట్లు గడిస్తున్న ఆ 'పాపాల వంటశాలల' గుట్టు విప్పుతూ, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారుల మెరుపు దాడుల్లో బయటపడిన ఆందోళనకరమైన దారుణాలు, మూతపడిన ప్రముఖ హోటళ్లు ఎక్కడో కాదు.. హైదరాబాద్ ఐటీ కారిడార్.. నిత్యం వేలాది మంది అడుగుపెట్టే హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్‌లో.. అసలు ఏ హోటల్‌లో ఏం బయటపడింది? ఎక్కడ ఏ ఆహారం దొరికింది? ఏ సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? పూర్తి కథనం లోపలి పేజీలో...



7లో..

## తొలి చిరునవ్వే..

**రతీ-మన్మథుల పూలబాణం!**

**చూపే చెలిమి... చెలిమే ప్రేమ... ప్రేమే జీవిత పరిమళం!**

మొదటి చూపు... వెంటనే ఓ చిరునవ్వు... ఆ నవ్వు వెనుక దాగిన భావమేనా ప్రేమకు తొలి పిలుపు? క్షణం పెదాలపై మెరిసి మాయమైన చిరునవ్వు, సంవత్సరాలు గడిచినా మనసులో ఎందుకు చెరిగిపోదు? రతీ-మన్మథుల పూలబాణం నుంచి రాధ-కృష్ణుల వేణుగానం వరకు.. శకుంతల-దుష్యంతుల మౌన చూపుల నుంచి నేటి ప్రేమకథల వరకు.. కాలం మారింది, ప్రదేశాలు మారాయి, మనుషులు మారారు.. కానీ ప్రేమ తొలి చప్పుడు మాత్రం అదే. ఓ చూపు చెలిమవుతుంది.. చెలిమి మమకారమవుతుంది.. మమకారం ఆత్మీయతగా మారుతుంది.. ఆ ఆత్మీయత దాంపత్యంగా మారిన క్షణం నుంచి ప్రేమకు అసలు పరీక్ష మొదలవుతుంది. ప్రేమలో కనిపించిన అందాన్ని ఆస్వాదించడం సులభమే.. కానీ జీవితంలో కనిపించే అలసటను అర్థం చేసుకోవడం ఎంతమందికి సాధ్యం? మాటలు లేని వేళ మనసు పలికే భాష ఏమిటి? ఒకరి నవ్వులో మరొకరు తమ ప్రపంచాన్ని చూసే బంధం ఎలా పుడుతుంది? శృంగారం శరీరాల దగ్గరితనమేనా.. లేక రెండు మనసుల మధ్య పెరిగే నిశ్శబ్ద సాన్నిహిత్యమా? యవ్వనం కరిగి, ముఖంపై ముడతలు చేరినా.. ఒకప్పుడు సిరిమల్లె పువ్వులా నవ్విన ఆ నవ్వు అదే మాధుర్యంతో మిగిలితే.. అదేనా జీవితాంతం నిలిచే ప్రేమ? ఒక చిరునవ్వుతో మొదలై.. ఒక జీవితాన్ని పరిమళింపజేసే ఆ ప్రేమ ప్రయాణమే ఈ కథనం.



## అక్టోబర్ 4న తెలంగాణకు అమిత్ షా

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నట్లు సమాచారం. కరీంనగర్‌లో జరిగే ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అనంతరం హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. హైదరాబాద్ పర్యటనలో తెలంగాణకు కొత్తగా నియమితులైన పార్టీ ఇన్‌ఛార్జ్‌లతో అమిత్ షా భేటీ అయ్యే అవకాశముంది. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అదే రోజు పార్టీ ఆఫీస్ బేరర్లతోనూ సమావేశం నిర్వహించే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కరీంనగర్ కార్యక్రమం తర్వాత హైదరాబాద్‌లో వరుస సమావేశాలతో అమిత్ షా పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. అయితే హైదరాబాద్‌లో భేటీలకు సంబంధించిన తుది షెడ్యూల్ ఇంకా ఖరారు కావాల్సి ఉంది.



2లో..

## ప్రజల గుండెల్లో కేసీఆర్

**పథకాలే గుర్తు చేస్తున్నాయన్న కేటీఆర్**

కేసీఆర్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించే వారికి ప్రజలే సమాధానం చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గణేశ్ పండుగ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడికి వెళ్లినా "దేఖ్ లేంగే.. కేసీఆర్" అనే మాట వినిపిస్తోందని పేర్కొన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉన్నా ప్రజల గుండెల్లో ఆయనకు స్థానం చెక్కుచెదరలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.



## ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

**ఉపఎన్నికలో టీఆర్ఎస్ పోటీ**

ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికలో తెలంగాణ రక్షణ సేన, టీఆర్ఎస్ పోటీ చేయనుంది. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఈ విషయాన్ని ప్రకటించారు. సరైన సమయంలో అభ్యర్థిని ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల ద్వారా పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగబద్ధత అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణపైనా కవిత స్పందించారు. (వివరాలు 2లో..)



## ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ సమరం

**సీఈసీపై మహేష్ గౌడ్ తీవ్ర ఆరోపణలు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై తెలంగాణ కాంగ్రెస్ పోరును మరింత ఉధృతం చేసింది. నిజామాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కేంద్ర ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆయన ఆరోపించారు. తన ఓటును కూడా తొలగించే ప్రయత్నం జరిగిందని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 28న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. (2లో..)

## మన్మోహన్‌కు భారత రత్న ఇవ్వాలి



- **ఢిల్లీలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి**
- **హైదరాబాద్‌లో విగ్రహావిష్కరణలో సీఎం**

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన సేవలకు గుర్తుగా ఢిల్లీలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలి విప్రో సర్కిల్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. దేశ ఆర్థిక వ్యవస్థను మౌనంగా ముందుకు నడిపించిన గొప్ప నాయకుడిగా ఆయనను కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పార్లమెంటులో ప్రస్తావించాలని పార్టీ ఎంపీలకు సూచించారు. (వివరాలు 2లో..)



2లో..

## నవంబర్‌లో కాళేశ్వరం వర్క్స్

**బ్యారేజీలకు పునరుద్ధరణకు శ్రీకారం**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 2027 వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. మూడు బ్యారేజీల భద్రతను పెంచడంతోపాటు పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో పునరుద్ధరణ ప్రతిపాదనలపై చర్చించారు.



6లో..

## ఖైరతాబాద్‌లో ఎవరిది పైచేయి?

**ఉపఎన్నికతో గ్రేటర్‌లో నయా జోష్**

ఖైరతాబాద్ ఉపఎన్నిక.. ఒక సీటు కోసం జరిగే పోరా? లేక హైదరాబాద్ రాజకీయాల్లో రాబోయే పెను మార్పులకు ఇది తొలి సంకేతమా? ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఈ గడ్డపై 2014లో బీజేపీ జెండా ఎగిరింది.. 2018, 2023లో బీఆర్ఎస్ హవా కొనసాగింది.. ఇప్పుడు అదే బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ శిబిరంలో నిలబడి తిరిగి అదే ప్రజల తీర్పును కోరుతున్నారు. మరోవైపు పీజేఆర్ కుటుంబ వారసత్వాన్ని ముందుకు తెచ్చే విష్ణువర్ధన్‌రెడ్డి పేరు బీఆర్ఎస్ శిబిరంలో చర్చకు వస్తుండగా.. 2014 గెలుపు జ్ఞాపకంతో బీజేపీ చింతల రామచంద్రారెడ్డిని మరోసారి రంగంలోకి దింపే ఆలోచనలో ఉంది. ఇంతలో కవిత కొత్త టీఆర్ఎస్ అడుగు పెడితే? జెన్‌జీ శక్తులు రంగ ప్రవేశం చేస్తే.. ఓట్ల చీలిక ఎవరికి లాభం.. ఎవరికి నష్టం? గతంలో జూబ్లీహిల్స్‌లో తన అంచనాలు ఫలితాలకు దగ్గరగా ఉన్నాయని చెబుతున్న పీసీఎస్.. ఖైరతాబాద్‌లో గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్ 43, బీజేపీ 32, బీఆర్ఎస్ 26 శాతం ఓట్లతో ఉంటుందని అంచనా వేసింది. అయితే అది తొమ్మిది నెలల నాటి లెక్క.. అప్పటి నుంచి రాజకీయ సమీకరణాలు ఎన్నో మారాయి. ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగు పెట్టింది.. దానం రాజకీయ ప్రయాణం కొత్త మలుపు తిరిగింది.. బీఆర్ఎస్ అభ్యర్థి ఇంకా తేలలేదు.. బీజేపీ వ్యూహం పదునెక్కుతోంది. మరి కొత్త సర్వే ఏం చెబుతుంది? ఉపఎన్నిక ముందా.. గ్రేటర్ వార్ ముందా? ఖైరతాబాద్ తీర్పు.. గ్రేటర్ రాజకీయాలకు దిశానిర్దేశం చేస్తుందా? అసలు ఆట ఎక్కడ మొదలవుతుంది?

# నవంబర్‌లో కాళేశ్వరం వర్క్స్

## బ్యారేజీలకు పునరుద్ధరణకు శ్రీకారం

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 2027 వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. మూడు బ్యారేజీల భద్రతను పెంచడంతోపాటు పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో పునరుద్ధరణ ప్రతిపాదనలపై చర్చించారు. గ్రౌటింగ్‌తో పునాదుల బలోపేతం, స్టిల్లింగ్ బేసిన్ల పొడిగింపు, కొత్త కట్ ఆఫ్ వాల్స్ నిర్మాణం వంటి కీలక పనులు చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు.



### డిజైన్లకు నిపుణుల పరీక్ష

వరద ప్రవాహ వేగాన్ని నియంత్రించడంలో ఉన్న లోపాలను సరిచేయడం, పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, నీటి చొరబాటును అడ్డుకోవడం పునరుద్ధరణ పనుల ప్రధాన లక్ష్యాలని మంత్రి చెప్పారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ)తోపాటు ఇతర నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకుని డిజైన్లు రూపొందించినట్లు తెలిపారు. పుణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్‌లో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాలతో డిజైన్లను పరీక్షిస్తున్నట్లు చెప్పారు. వివిధ వరద ప్రవాహ పరిస్థితుల్లో ప్రతిపాదిత చర్యలు ఎంత సమర్థంగా పనిచేస్తాయో ఈ పరీక్షల ద్వారా అంచనా వేయనున్నారు. ఖరారు చేసిన డిజైన్లను అక్టోబర్ 5న న్యూఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందు ఉంచనున్నారు.

### భద్రతలో రాజీ ఉండదన్న మంత్రి

సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. డిజైన్లకు ఆమోదం లభించిన వెంటనే టెండర్లు పిలిచి పనులు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో కఠినమైన నాణ్యతా ప్రమాణాలు, స్వతంత్ర పరీక్షలు, స్పష్టమైన కాలపరిమితులు ఉండాలని ఆదేశించారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా దీర్ఘకాలం మన్నే సాంకేతిక పరిష్కారాలతో బ్యారేజీలను పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జాతీయ సాంకేతిక సంస్థల నుంచి అవసరమైన భద్రతా అనుమతులు వచ్చిన తర్వాతే మూడు బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి దశను నిపుణుల పర్యవేక్షణలో నమోదు చేయాలని, ఎన్‌డీఎస్‌ఏ సూచనలను పూర్తిగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు.

# ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ సమరం

## సీఈసీపై మహేష్ గౌడ్ తీవ్ర ఆరోపణలు



తన ఓటును కూడా తొలగించే ప్రయత్నం జరిగిందని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 28న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.

### సర్‌పై యువతలో ఆందోళన

మహారాష్ట్ర, కర్ణాటకలో కాంగ్రెస్‌కు మెజారిటీ వస్తున్నప్పుడు ఇతర రాష్ట్రాల్లో ఫలితాల్లో ఎందుకు వ్యత్యాసం కనిపిస్తోందని మహేష్‌గౌడ్ ప్రశ్నించారు. సర్‌లో ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపించిన ఆయన, దీనిని పూర్తిగా నిర్ధారించే ఆధారాలు చూపించడం కష్టమని వ్యాఖ్యానించారు. యువతలో సర్‌పై ఆందోళన పెరుగుతోందని, అందుకే నిరసనలు జరుగుతున్నాయని అన్నారు.

### పార్లమెంటులో పోరుకు సిద్ధం

2002 ఓటర్ల జాబితాతో అనుసంధానం చేసే నిబంధనపై తెలంగాణ కాంగ్రెస్ గతంలోనే అభ్యంతరం వ్యక్తం చేసిందని గౌడ్ తెలిపారు. తనకు పలుమార్లు ఓటు వేసిన నిజామాబాద్‌లోనే తన ఓటు తొలగింపునకు కుట్ర జరిగిందని ఆరోపించారు. లౌకికవాదుల ఓట్లను తొలగించే ప్రక్రియ జరుగుతోందని విమర్శించారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే సీఈసీపై చర్య కోసం మద్దతు కూడగడుతున్నారని తెలిపారు. కాగా, సర్‌పై ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది.

# మన్మోహన్‌కు భారత రత్న ఇవ్వాలి

- ఢిల్లీలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి
- హైదరాబాద్‌లో విగ్రహావిష్కరణలో సీఎం




### ఆర్థిక సంస్కరణల శిల్పి

మన్మోహన్‌సింగ్ భారత్ గర్వించదగ్గ జాతిరత్నం అని రేవంత్ రెడ్డి అన్నారు. రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఆయన చేపట్టిన ప్రతి పదవికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారని పేర్కొన్నారు. 1991లో పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి కీలక సంస్కరణలకు దిశానిర్దేశం చేశారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థలో మార్పులకు బాటలు వేశారని తెలిపారు.

### తెలంగాణ కల సాకారం.. హక్కుల చట్టాలు

తెలంగాణ ఏర్పాటు చరిత్రలో సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ పాత్ర కీలకం అని సీఎం గుర్తు చేశారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో



విలీనం చేసిన ఘనత నెహ్రూ, పటేల్‌కు దక్కితే, దశాబ్దాల తెలంగాణ ఆకాంక్షను సాకారం చేసిన ఘనత సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్‌కు దక్కుతుందని అన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన ఆయన సంతకాన్ని విగ్రహ ప్రాంగణంలో పదిలపరిచామని తెలిపారు. విద్యా హక్కు, జాతీయ ఉపాధి హామీ, భూసేకరణ-పునరావాస చట్టాలు వంటి చర్యలు ఆయన పాలనలో చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. మన్మోహన్ సింగ్ జ్ఞాపకం దేశ రాజధానిలో శాశ్వతంగా నిలిచేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రజల గుండెల్లో కేసీఆర్

## పథకాలే గుర్తు చేస్తున్నాయన్న కేటీఆర్



### పెన్షన్, నీటిలో కేసీఆర్ గుర్తు

రాష్ట్రంలో 46 లక్షల మంది పింఛన్‌దారులు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. గతంలో రూ.200గా ఉన్న పింఛన్‌ను రూ.2 వేలకు పెంచిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. ఇంటింటికీ నల్లా నీరు అందించిన మిషన్ భగీరథను ప్రస్తావిస్తూ.. నీటి బొట్టులో కూడా కేసీఆర్ కనిపిస్తున్నారని అన్నారు. గతంలో బిందెలతో నీటి కోసం ఇబ్బందులు పడిన మహిళలకు ఆ పరిస్థితి తప్పిందని వ్యాఖ్యానించారు. కళ్యాణ లక్ష్మి ద్వారా ఆడపిల్లల వివాహానికి ఆర్థిక సాయం అందిన ప్రతిసారి తల్లిదండ్రులు కేసీఆర్‌ను మేనమామలా గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చిన విషయాన్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

### రైతుబంధుపై కాంగ్రెస్‌పై విమర్శలు

రైతుబంధు నిధుల విషయంలోనూ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. కేసీఆర్ హయాంలో నాట్ల సమయానికి రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమయ్యేవని, ఇప్పుడు నిధుల కోసం రైతులు ఎదురుచూడాల్సి వస్తోందని ఆరోపించారు. ఎకరాకు సాయం అందించిన ప్రతిసారీ కాంగ్రెస్ ప్రభుత్వం సమావేశాలు నిర్వహిస్తూ గొప్పగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనుల కంటే కేసీఆర్‌ను విమర్శించడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

# ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

## ఉపఎన్నికలో టీఆర్ఎస్ పోటీ

### ప్రభుత్వంపై కవిత విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వం దర్యాప్తుల పేరుతో రాజకీయ హడావుడి చేస్తోందని కవిత విమర్శించారు. 'ఫామ్‌హౌస్ రాజకీయాల' పేరుతో సంచలనం సృష్టించి, కొంతకాలానికి విషయాన్ని పక్కన పెడుతున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు ఏం జరిగిందని ప్రశ్నించారు. తన ఆస్తులపై వస్తున్న ఆరోపణలను ఆమె ఖండించారు. తన ఆస్తులను చట్టబద్ధంగానే సంపాదించానని, అక్రమంగా ఆస్తులు ఉన్నట్లు



నిరూపిస్తే ఆ ఆస్తులను వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఖైరతాబాద్ ఉపఎన్నికకు అధికారిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ఇంకా ప్రకటించలేదు.



# 20 వేల విగ్రహాలు..

# ప్రశాంతంగా నిమజ్జనం!

- 24 గంటలపాటు పోలీసుల పహారా
- పోలీసులతో కలిసి సీపీ సజ్జనార్ సంబరాలు

హైదరాబాద్‌లో వినాయక నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. హుస్సేన్‌సాగర్‌లో నగరం, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ పరిధుల నుంచి వచ్చిన 20 వేలకు పైగా భారీ వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. 69 అడుగుల భారీ వినాయకుడి నిమజ్జనంతో ప్రారంభమైన ప్రధాన ఊరేగింపులో బాలాపూర్ గణేశుడి విగ్రహం కూడా పాల్గొంది. దాదాపు 24 గంటల పాటు పోలీసులు నిరంతరం విధుల్లో ఉండి ఊరేగింపులు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. నిమజ్జన మార్గాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. ఒక్క అవాంఛనీయ ఘటన కూడా చోటుచేసుకోకుండా వేడుకలు పూర్తవడం పోలీసు యంత్రాంగానికి పెద్ద ఊరటగా మారింది. తెలంగాణ ప్రభుత్వం, డీజీపీ, ఇతర శాఖలు అందించిన సహకారానికి సీపీ సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు.

డ్యూటీ ముగిసింది.. పోలీసుల సంబరం

నిమజ్జన కార్యక్రమం పూర్తయిన తర్వాత పోలీసు సిబ్బందితో కలిసి సీపీ సజ్జనార్ "ఆయా షేర్" పాటకు ఉత్సాహంగా డ్యాన్స్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు. విధుల్లో గంటల తరబడి శ్రమించిన సిబ్బందితో కలిసి ఆయన ఆనందాన్ని పంచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నగరంలో ప్రధాన నిమజ్జన ప్రక్రియ దాదాపు పూర్తికావడంతో ట్రాఫిక్ పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నాయని సీపీ తెలిపారు. ఇంకా కొన్ని విగ్రహాలు మాత్రమే నిమజ్జనం కావాల్సి ఉందన్నారు. సెప్టెంబర్ 14న ప్రారంభమైన పది రోజుల గణేశ్ ఉత్సవాలు నిమజ్జనంతో ముగిశాయి. ఇళ్లలో ప్రతిష్ఠించిన చిన్న విగ్రహాలతో పాటు ఐదు అడుగులకు పైబడిన భారీ విగ్రహాలు పెద్ద సంఖ్యలో నిమజ్జనం అయ్యాయి. శాంతియుతంగా ఉత్సవాలు ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# తెలంగాణ మరో మైలురాయి

- నిలిచిన ప్రాజెక్టుకు మళ్లీ ఊపిరి
- యాదాద్రి ప్లాంట్ నుంచి 140 ఎంయూ లక్ష్యం

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి రోజుకు సగటున 140 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే దిశగా తెలంగాణ జెన్‌కో కసరత్తు చేస్తోంది. 2017లో నిర్మాణం ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు కారణంగా నిలిచిపోయింది. పర్యావరణ అనుమతుల ప్రక్రియలో జాప్యంతో పనులు ముందుకు సాగలేదు. 2023 డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనుమతుల కోసం చర్యలు వేగవంతమయ్యాయి. 2024 ఫిబ్రవరిలో పర్యావరణ అనుమతి లభించగా, ఫిబ్రవరి 20న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మే 7న సవరించిన పర్యావరణ అనుమతి రావడంతో దాదాపు 19 నెలల విరామం తర్వాత నిర్మాణం, కమీషనింగ్ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. 2024 సెప్టెంబర్ 12న యూనిట్ 2, నవంబర్ 3న యూనిట్ 1 గ్రిడ్‌కు అనుసంధానమయ్యాయి.

### నాలుగు యూనిట్లతో సామర్థ్యం పెంపు

అటవీ భూముల అనుమతుల్లో జాప్యంతో రైల్వే లైన్, ముడి నీటి సేకరణ పనులు కూడా నిలిచిపోయాయి. 2023 డిసెంబర్ 15న కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 13.195 హెక్టార్ల అటవీ భూమికి స్టేజ్ 2 అనుమతులు ఇవ్వడంతో మార్షలింగ్ యార్డ్, రైల్వే అనుసంధాన సమస్యలు తొలగిపోయాయి. బీహెచ్‌ఈఎల్ చేపట్టాల్సిన కొన్ని పనులు ఇంకా కొనసాగుతున్నా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. జనవరి 2025లో తొలి 800 మెగావాట్ల యూనిట్ ప్రారంభమైంది. ఆ తర్వాత మరో మూడు 800 మెగావాట్ల యూనిట్లు అందుబాటులోకి రావడంతో యాదాద్రి పూర్తి సామర్థ్యం దిశగా సాగుతోంది. దీంతో 2026-27లో TGGENCO థర్మల్ విద్యుత్ స్థాపిత సామర్థ్యం 7,180 మెగావాట్లకు చేరింది. సింగరేణి నుంచి బొగ్గు సరఫరా సమస్యలను అధిగమించేందుకు నైనీ గనుల నుంచి రోజుకు రెండు రైళ్ల బొగ్గు రవాణాకు చర్యలు చేపట్టారు. మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి నాణ్యమైన బొగ్గు తీసుకొచ్చే ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.



### ఉత్పత్తిలో కొత్త రికార్డుల దిశగా

టీజీజెన్కో థర్మల్ ఉత్పత్తి సామర్థ్యం 2023 డిసెంబర్‌లో 4,042.5 మెగావాట్ల నుంచి 7,180 మెగావాట్లకు పెరిగింది. 2022-23లో రోజుకు సగటు 69.71 ఎంయూగా ఉన్న థర్మల్ ఉత్పత్తి 2025-26లో 78.88 ఎంయూకు చేరింది. 2026-27 ప్రారంభంలో రోజువారీ సగటు ఏకంగా 90.23 ఎంయూగా నమోదైంది. భద్రాద్రి ప్లాంట్‌లోనూ ప్రారంభ సమస్యలను అధిగమించి 2025-26లో తొలిసారి 80 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ దాటినట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని యాదాద్రి ప్లాంట్‌లో రోజుకు 140 ఎంయూ సగటు ఉత్పత్తి సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించినట్లు తెలంగాణ జెన్‌కో వెల్లడించింది.

# మందు తాగిన కోతి



- వోడ్కా కొట్టేసిన వానరం
- మత్తులో కార్టన్‌పై నిద్ర

జార్ఖండ్ రాజధాని రాంచీలోని ఓ మద్యం దుకాణంలో ఊహించని అతిథి ప్రత్యక్షమై సందడి చేసింది. ఓర్మాంఝీ చౌక్‌లోని మద్యం షాపులోకి అకస్మాత్తుగా ఓ కోతి దూసుకొచ్చింది. మొదట దాన్ని బయటకు పంపేందుకు సిబ్బంది ప్రయత్నించారు. బిస్కెట్లు చూపించి దృష్టి మళ్లించాలనుకున్నారు. కానీ కోతి మాత్రం ఎవరి మాటా వినలేదు. నేరుగా మద్యం బాటిళ్ల వైపు వెళ్లి వోడ్కా బాటిల్‌ను ఎంచుకుంది. బాటిల్‌ను పగులగొట్టి అందులోని మద్యాన్ని తాగడం మొదలుపెట్టింది. షాపులో ఉన్నవాళ్లు ఏం జరుగుతుందో అర్థం కాక చూస్తుండిపోయారు.

సగం బాటిల్ తాగి మత్తులోకి

కొద్దిసేపటికే కోతి చేసిన పని అక్కడున్న వారందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. వోడ్కాలో సగం వరకు తాగేసిన కోతి.. మద్యం కార్టన్లపై వాలిపోయింది. కాసేపటికి కళ్లు మూసుకుని అక్కడికక్కడే నిద్రలోకి జారుకుంది. సాధారణంగా షాపులోకి చొరబడిన దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగిస్తారు. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నం. దొంగతనానికి వచ్చినట్టుగా కనిపించిన ఈ 'అతిథి' మద్యం తాగి నిద్రపోవడంతో స్థానికులు తమ మొబైల్ ఫోన్లను బయటకు తీశారు. షాపు సిబ్బంది తమ పనులు చేసుకుంటుండగా.. వెనుకవైపు కార్టన్లపై కోతి హాయిగా నిద్రపోతున్న దృశ్యాలు వీడియోల్లో కనిపించాయి.

### కోతికి ఇదేమీ కొత్త కాదట!

ఈ ఘటనలో మరో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆ కోతి మద్యం షాపు పరిసరాల్లో కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఖాళీ బాటిళ్లలో మిగిలిపోయిన మద్యాన్ని గతంలోనూ అది నాలుకతో నాకుతూ కనిపించిందట. అయితే ఈసారి ఏకంగా షాపులోకి ప్రవేశించి బాటిల్ పగులగొట్టి మద్యం తాగడం.. చివరకు కార్టన్‌పైనే మత్తులో నిద్రపోవడం అక్కడివారికి నవ్వు తెప్పించింది. ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. రాంచీలో జరిగిన ఈ వింత ఘటన.. మద్యం షాపులో దొంగతనానికి వచ్చిన కోతి, చివరకు మత్తులోనే పట్టుబడిన కథగా అందరినీ ఆకట్టుకుంటోంది.



# వద్దురా బాబు వద్దు

- వంటగదుల్లో కంపు.. ప్లేట్లలో కలకలం
- బొద్దింకలు, ఎలుకలతో ఫుడ్ ఫైట్
- టీజీ సేఫ్ కొరడా.. 20 చోట్ల తనిఖీలు
- 11 హోటళ్ల లైసెన్సులపై వేటు
- సామాన్యుడి ఆకలి.. ఆరోగ్యానికి ముప్పు!

హైదరాబాద్‌లోని మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో టీజీ సేఫ్ అధికారులు భారీ తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 10 ప్రత్యేక బృందాలు 20 రెస్టారెంట్లను తనిఖీ చేశాయి. ఈ తనిఖీల్లో పలు చోట్ల బొద్దింకలు, ఎలుకలు, ఈగలు, ఎలుకల విసర్జన కనిపించాయి. కాలం చెల్లిన ఆహార పదార్థాలు, పాడైన కూరగాయలు గుర్తించి అక్కడికక్కడే తొలగించారు. ఆహార పదార్థాల నిల్వలో లోపాలు, సరైన లేబులింగ్ లేకపోవడం, అపరిశుభ్రమైన వంటగదులు, మురికి డ్రైనేజీలు, జిడ్డుపట్టిన చిమ్నీలు, గోడలు, పైకప్పులు, సరిగా శుభ్రం చేయని పాత్రలు వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయి.

- **21 నమూనాలు సేకరణ.. నోటీసులు**

అనుమానాస్పద కల్తీపై 21 ఆహార నమూనాలను అధికారులు సేకరించారు. రామేశ్వరం కేఫ్, ఇష్టా, సాహిబ్స్ బార్బెక్యూ, పక్కా లోకల్, హోటల్ షాదాబ్, షా గౌస్ సంస్థలకు మెరుగుదల నోటీసులు ఇవ్వనున్నారు. తిరిగి తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటిస్తున్నారా లేదా పరిశీలించనున్నారు. 63 డిగ్రీస్ మోడ్రన్ రీజినల్ బఫే, మినర్వా గ్రాండ్, హోటల్ అవాసాకు షోకాజ్ నోటీసులు జారీ చేసి జరిమానాల ప్రక్రియ చేపట్టనున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 11 సంస్థల ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్సులను సస్పెండ్ చేసి, వెంటనే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు.

- **లైసెన్సుల రద్దు – రెస్టారెంట్ల సీజ్!**

పరిస్థితి మరీ దారుణంగా, ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలిగించేలా ఉన్న 11 రెస్టారెంట్ల లైసెన్సులను అధికారులు తక్షణమే సస్పెండ్ చేసి, వ్యాపారాలను వెంటనే క్లోజ్ చేయించారు. ఈ జాబితాలో హైటెక్ సిటీలోని మొనాస్టరీ, కోల్ స్పార్క్, కంచి కేఫ్ ఉన్నాయి. మాదాపూర్ పరిధిలో లక్కీ మల్టీకుసిన్, సాయి రామ్ మెస్ లతో పాటు ఇన్‌ఆర్బిట్ మాల్‌లోని ఆమ్ ఆహా తెలుగు కిచెన్, ఫ్యూజన్ 9, అమ్నీషియా స్కై బార్ ఉన్నాయి. ఇక గచ్చిబౌలి ప్రాంతంలో శివాని ది రెస్టారెంట్ అండ్ బార్, అల్ సబా, ఉడుపిస్ ఉపహార్, అంతెర కిచెన్ అండ్ బార్లపై ఈ కఠినమైన మూసివేత వేటు పడింది.

### షోకాజ్ నోటీసులు – జరిమానాల మోత!

తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 3 ప్రముఖ సంస్థలకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీటికి త్వరలోనే భారీ స్థాయిలో ఆర్థిక జరిమానాలు విధించేందుకు చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. ఈ విభాగంలో గచ్చిబౌలిలోని 63 డిగ్రీస్ మోడర్న్ రీజినల్ బఫే, కొండాపూర్‌లోని మినర్వా గ్రాండ్, హైటెక్ సిటీలోని హోటల్ అవసా నిలిచాయి.

- **చివరసారిగా వార్నింగ్**

వంటగది నిర్వహణలో లోపాలు కనిపించిన 6 ప్రముఖ హోటళ్లకు అధికారులు మెరుగుపర్చుకోవాలని నోటీసులు ఇచ్చారు. గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దుకోవాలని, లేదంటే తదుపరి తనిఖీల్లో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ హెచ్చరికలు అందుకున్న వాటిలో మాదాపూర్‌లోని రామేశ్వరం కేఫ్, గచ్చిబౌలిలోని ఇష్టా (విరుంత ఫుడ్స్), హోటల్ షాదాబ్, షా ఘౌస్, మరియు హైటెక్ సిటీలోని సాహిబ్స్ బార్బెక్యూ, పక్కా లోకల్ ఉన్నాయి.

బయట మెరిసే వెలుగుల వెనుక దాగున్న ఈ చీకటి కోణం నగరవాసులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇష్టమైన రుచులను ఆస్వాదించడానికి వచ్చే సామాన్యుడి ఆరోగ్యాన్ని, ప్రాణాలను వ్యాపారులు పణంగా పెట్టడం గమనార్హం. కేవలం లాభాపేక్షతోనే కనీస పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకుండా ప్రజ ప్రజారోగ్యంతో ఆడుకుంటున్న ఇలాంటి బాధ్యతారాహిత్య హోటళ్లపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం శ్లాఘనీయం. తనిఖీలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, నిరంతర పర్యవేక్షణ ఉన్నప్పుడే ఇటువంటి ఉల్లంఘనలకు చెక్ పడుతుంది. ఇకనైనా ఆహార ప్రియులు కాస్త జాగ్రత్త వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.







# ఎస్ఐఆర్ రగడ

- ఢిల్లీలో విపక్ష భేటీకి పిలుపు
- రాహుల్‌కు మమత సందేశం



పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) వివాదం వేడెక్కుతున్న వేళ విపక్ష కూటమి మరోసారి సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 26న హుగ్లీ జిల్లా సెరాంపూర్‌లో జరిగిన బహిరంగ సభలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీలు కలిసి కూర్చొని చర్చించాల్సిన అవసరం ఉందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సందేశం పంపినట్లు తెలిపారు. సెప్టెంబర్ 30న ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా కూటమి సమావేశం జరిగే అవకాశం ఉందని మమత పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్‌పైనే ప్రధాన చర్చ

ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల సంఘం పనితీరు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశం, ఎస్ఐఆర్ ప్రక్రియపై విపక్షాలు అనుసరించాల్సిన తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం ఉంది. ఎన్నికల సంఘానికి సంబంధించిన అంశాలపై ఉమ్మడి వ్యూహం రూపొందించడమే సమావేశం ప్రధాన ఉద్దేశంగా మమతా బెనర్జీ తెలిపారు. ఈ అంశంపై విపక్ష పార్టీల మధ్య సమన్వయం పెంచేందుకు ఇప్పటికే సంప్రదింపులు జరుగుతున్నట్లు సమాచారం.

## విపక్ష సమన్వయానికి మరో అడుగు

సమావేశాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని మమతా బెనర్జీ రాహుల్ గాంధీని కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆమె సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీతోనూ మాట్లాడినట్లు సమాచారం. ఎన్నికల సంఘం, ఎస్ఐఆర్ అంశాలపై తదుపరి పోరాట కార్యాచరణను ఖరారు చేయడమే లక్ష్యంగా చర్చలు సాగనున్నట్లు వర్గాలు చెబుతున్నాయి. అయితే సెప్టెంబర్ 30న సమావేశం జరుగుతుందన్నది ప్రస్తుతం మమతా బెనర్జీ వెల్లడించిన ప్రతిపాదిత షెడ్యూల్‌గానే ఉంది. ఈ భేటీకి విపక్ష కూటమిలోని ఏయే పార్టీలు హాజరవుతాయన్న దానిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# ఈసీ సభ్యులకు రక్షణలు తొలగించాలి

**కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక డిమాండ్**




ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై విపక్షాల విమర్శలు మరింత తీవ్రతరమవుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా శనివారం కేరళలోని మలప్పురంలో మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్లకు కల్పించిన చట్టపరమైన రక్షణలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ రక్షణలు ఎన్నికల సంఘాన్ని జవాబుదారీతనం నుంచి కాపాడేలా ఉన్నాయని ఆమె ఆరోపించారు. ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కూడా ఆమె కోరారు.

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్

ప్రస్తుతం తమ తక్షణ డిమాండ్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామానేనని ప్రియాంక గాంధీ తెలిపారు. ఇండియా కూటమి మొత్తం ఈ డిమాండ్‌పై ఏకాభిప్రాయంతో ఉందని ఆమె పేర్కొన్నారు. రాజ్యాంగం, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందేనని ఆమె అన్నారు. ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలపై రాజకీయ నాయకత్వం మద్దతు లేకుండా ఇలాంటి పరిణామాలు జరగడం కష్టమని కూడా ఆమె ఆరోపించారు. ఇవన్నీ ప్రియాంక గాంధీ చేసిన రాజకీయ ఆరోపణలేనని గమనించాలి.

# ఆరోపణలపై ఈసీ సమాధానం ఇవ్వాలి

**బీజేపీ ఉపాధ్యక్షుడు రామ్‌మాధవ్**



ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వస్తున్న అక్రమాల ఆరోపణలకు ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాల్సిందేనని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు వి. రామ్‌మాధవ్ అన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్‌లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ అంశంపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ఎన్నికల్లో పాల్గొనడంపైనా ప్రశ్న

ఎన్నికలు రిగ్గింగ్ అవుతున్నాయని నిజంగా నమ్మితే కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలు ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నాయని రామ్‌మాధవ్ ప్రశ్నించారు. కేరళ, కర్ణాటక, తెలంగాణలో విపక్షాలు సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ.. తమ గెలుపుపై కూడా విపక్షాలు స్పష్టత ఇవ్వాలని అన్నారు. ఎన్నికలు ముందే నిర్ణయించబడుతున్నాయన్న వాదనలు చేస్తున్న కొందరు నేతలపై ఆయన విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఎలా నిర్ధారించారంటూ రామ్‌మాధవ్ ప్రశ్నించారు. 2014, 2015, 2016 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హయాంలో ఏర్పడిన ఎన్నికల సంఘమే కొనసాగిందని గుర్తుచేశారు.

## మోదీపై రామ్‌మాధవ్ వ్యాఖ్యలు

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల విజయాలపైనా రామ్‌మాధవ్ స్పందించారు. ప్రజాదరణ లేకుండా వరుస విజయాలు సాధించడం సాధ్యమా అన్న ప్రశ్నను ప్రస్తావించారు. మోదీ మరిన్ని ఎన్నికల్లో విజయం సాధిస్తారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. దీనికి ఆయన 'అంత్యోదయ' భావనను కారణంగా పేర్కొన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతం.. సమాజంలోని చివరి వ్యక్తికీ అభివృద్ధి ఫలాలు అందాలన్న లక్ష్యాన్ని సూచిస్తుందని వివరించారు. విజయవాడ కార్యక్రమంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పి.వి. మాధవ్, రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఈసీలో.. విభేదాలు?

## ముగ్గురు కమిషనర్ల కీలక భేటీ




ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలపై వార్తలు చర్చనీయాంశమైన వేళ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన ఈ భేటీ అనంతరం ఈసీ ఎస్ఐఆర్ సహా కీలక నిర్ణయాలన్నీ ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నామని స్పష్టం చేసింది. ఫారం 6 మార్పులు, ఈసీనెట్ వ్యవస్థ, ఐటీ విభాగంలో బాధ్యతల మార్పు, పశ్చిమ బెంగాల్ ఎస్ఐఆర్ అప్పీళ్లు, గోవాలో ఓటర్ల జాబితా అంశాలపై కమిషనర్ల మధ్య విభేదాలున్నాయన్న వార్తల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఫారం-6 నుంచి ఈసీనెట్ వరకు

ఎస్ఐఆర్ సమయంలో కొత్త ఓటర్ల ఫారం 6తో జత చేసిన డిక్లరేషన్‌పై వచ్చిన అభ్యంతరాలపై ఈసీ వివరణ ఇచ్చింది. తల్లిదండ్రుల పేర్ల ఆధారంగా గత ఎస్ఐఆర్ జాబితాతో వివరాలను అనుసంధానించే విధానాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. ఈసీనెట్ పోర్టల్‌పై సమీక్ష కోసం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఐఐటీ లేదా ఐఐఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడిని కూడా కమిటీలో చేర్చనున్నారు. గోవాలో జాబితా నుంచి మినహాయించబడిన 97 మంది ఓటర్లలో 81 మంది ఇప్పటికే ఫారం 6 దాఖలు చేసినట్లు ఈసీ తెలిపింది.

## ఎస్ఐఆర్‌పై ఏకగ్రీవ నిర్ణయాలే

2025 జూన్ 24న ఎస్ఐఆర్ ప్రారంభానికి జారీ చేసిన ఉత్తర్వుతో పాటు తరువాతి షెడ్యూళ్లన్నీ ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయని ఈసీ మరోసారి స్పష్టం చేసింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను ముందుగానే సభ్యులకు పంపాలని, సమావేశాల మినిట్స్ నమోదు చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు ఇచ్చే ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించింది. ఢిల్లీలో ఎస్ఐఆర్ క్లెయిమ్స్, అభ్యంతరాల గడువును అక్టోబర్ 30 వరకు పొడిగించగా, పరిష్కార గడువును నవంబర్ 30 వరకు పెంచింది. మహారాష్ట్రలోనూ గడువులను పొడిగించింది. దీంతో అంతర్గత చర్చలు వేరు, అధికారిక నిర్ణయాలు వేరు అని ఈసీ స్పష్టం చేసినా.. ఈ వ్యవహారంపై విపక్షాల ప్రశ్నలు మాత్రం కొనసాగుతున్నాయి.

# సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలి

- ఫామ్ 6 మార్పుల గుట్టు తేలాలి
- ఈసీలో అవకతవకలపై కాంగ్రెస్




ఓటర్ల నమోదు ప్రక్రియలో ఫామ్ 6కు సంబంధించిన మార్పులపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో చట్టవిరుద్ధ, రాజ్యాంగ విరుద్ధ మార్పులు జరిగాయని ఆరోపిస్తూ సుప్రీంకోర్టు స్వయంగా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది. జులైలో ఆన్‌లైన్ ఫామ్ 6లో కొత్తగా ఒక ప్రకటనను చేర్చారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. గత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితాలో దరఖాస్తుదారుడి తల్లిదండ్రులు లేదా తాత, నానమ్మ పేర్లు ఉన్నాయా అనే వివరాలు కోరడం వల్ల యువతకు కొత్తగా ఓటరుగా నమోదు కావడం కష్టమవుతోందని ఆయన అన్నారు. ఈ మార్పుకు అధికారిక నోటిఫికేషన్ జారీ కాలేదని కాంగ్రెస్ వాదిస్తోంది.

## యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి

ఈ వివాదం మధ్య ఎన్నికల సంఘం యువ ఓటర్ల కోసం ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ శిబిరాలకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించింది. ముందుగా నమోదు ప్రక్రియలో అదనపు నిబంధన పెట్టి, ఇప్పుడు ప్రత్యేక శిబిరాల ద్వారా యువతను నమోదు చేయడం ఎందుకని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ముఖ్యంగా తొలిసారి ఓటు వేయబోయే జనరేషన్‌జెడ్ ఓటర్లపై ఈ అంశం ప్రభావం చూపుతుందని కాంగ్రెస్ పేర్కొంది. మరోవైపు, ఎన్నికల సంఘం మాత్రం ఫామ్ 6ను అధికారికంగా సవరించలేదని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అదనపు వివరాల కోసం ప్రత్యేక ప్రకటనను సూచనల ద్వారా తీసుకొచ్చినట్లు ఈసీ వివరణ ఇచ్చింది.

## సుప్రీంకోర్టు జోక్యానికి పిలుపు

ఫామ్ 6లో మార్పులు చేయడానికి ఎన్నికల సంఘానికి అధికారం లేదని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన ప్రక్రియ ద్వారా మార్పులు చేయాల్సి ఉంటుందని కాంగ్రెస్ వాదిస్తోంది. జైరాం రమేశ్ ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు వెంటనే స్వయంచాలకంగా విచారణ చేపట్టి బాధ్యతను నిర్ణయించాలని కోరారు. ఇప్పటికే ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలపై మరో పిటిషన్ కూడా సుప్రీంకోర్టులో దాఖలైంది. అయితే ఎన్నికల సంఘం ప్రకారం ఎస్ఐఆర్‌కు సంబంధించిన తుది నిర్ణయాలను ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగానే తీసుకున్నారు. దీంతో ఫామ్ 6లోని అదనపు ప్రకటన చట్టబద్ధత, దాని అమలు విధానం, యువ ఓటర్ల నమోదుపై ప్రభావం ఇప్పుడు రాజకీయంగా, న్యాయపరంగా చర్చనీయాంశంగా మారింది.

## వివాదానికి ఈసీ వివరణ

ఎన్నికల సంఘం వెల్లడించిన సమాచారం ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియలో కొత్త ఓటర్ల నమోదుకు ఫామ్ 6తో పాటు అవసరమైన డిక్లరేషన్ సమర్పించే విధానం అమల్లో ఉంది. కొత్త ఓటర్లకు నమోదు అవకాశాన్ని కల్పించేందుకు బూత్ స్థాయిలో ఫామ్ 6 అందుబాటులో ఉంచాలని ఈసీ గతంలోనే సూచించింది. అందువల్ల కాంగ్రెస్ చేస్తున్న 'ఫామ్ 6 సవరణ' ఆరోపణకు, ఈసీ చెబుతున్న 'అదనపు డిక్లరేషన్ మాత్రమే' అన్న వివరణకు మధ్య ఉన్న తేడానే ప్రస్తుత వివాదానికి కేంద్రంగా ఉంది.

# సీఈసీ ఆధిపత్యం

- సుప్రీంకోర్టు హెచ్చరిక!
- ఒకరి చేతిలో అధికారం వద్దు



ఎన్నికల సంఘం పనితీరుపై తాజా వివాదాల నేపథ్యంలో దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలు మరోసారి చర్చకు వచ్చాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ తనను తాను ఇతర కమిషనర్ల కంటే ఉన్నతుడిగా భావించి, తన మాటే తుది నిర్ణయమని వ్యవహరిస్తే మిగతా ఎన్నికల కమిషనర్లు 'నిరుపయోగం' లేదా కేవలం అలంకారప్రాయంగా మారిపోతారని కోర్టు హెచ్చరించింది. ఎస్.ఎస్. ధనోవా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో వ్యక్తమైన ఈ ఆలోచనను తరువాత టి.ఎన్. శేషన్ కేసులో రాజ్యాంగ ధర్మాసనం కూడా ప్రస్తావించింది.

## ప్రతి కమిషనర్‌కూ నిర్ణయాధికారం

ఎన్నికల సంఘం వంటి విస్తృత అధికారాలు కలిగిన సంస్థలో నిర్ణయాలు ఒక్కరి చేతిలో కేంద్రీకృతం కాకూడదన్నదే కోర్టు అభిప్రాయం. ఎన్నికల కమిషనర్లు నిర్ణయ ప్రక్రియలో తప్పనిసరిగా తమ అభిప్రాయం చెప్పే అవకాశం కలిగి ఉండాలని టి.ఎన్. శేషన్ తీర్పు స్పష్టం చేసింది. సీఈసీ సమావేశాలకు అధ్యక్షత వహించే సమయంలో సహచర కమిషనర్ల విశ్వాసాన్ని పొందేలా వ్యవహరించాలని కోర్టు పేర్కొంది. ఇతర కమిషనర్లను తన కింది అధికారులుగా భావిస్తే సమిష్టి పనితీరు దెబ్బతింటుందని కూడా సూచించింది. బహుళ సభ్యుల సంస్థలు మెజారిటీ విధానంతో పనిచేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమని కోర్టు వివరించింది.

## సమష్టి నిర్ణయాలకే ప్రాధాన్యం

ఎన్నికల సంఘం స్వతంత్రంగా, పరస్పర గౌరవంతో పనిచేయాల్సిన సంస్థగా సుప్రీంకోర్టు తీర్పులు పేర్కొన్నాయి. సభ్యుల మధ్య సహకారం, భిన్నాభిప్రాయాలకు గౌరవం, మెజారిటీ ఆధారిత నిర్ణయాలు సంస్థ విశ్వసనీయతకు కీలకమని న్యాయస్థానం వివరించింది. 2023లో రూపొందిన చట్టంలోని సెక్షన్ 18 కూడా ఎన్నికల సంఘం తన వ్యవహారాలను ఏకాభిప్రాయంతో లేదా మెజారిటీ అభిప్రాయం ఆధారంగా నిర్వహించాల్సిన విధానాన్ని నిర్దేశిస్తుంది. ప్రస్తుతం ఎన్నికల జాబితాల సవరణకు సంబంధించిన అంశాలపై ఈసీలో భిన్నాభిప్రాయాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో, సుప్రీంకోర్టు గతంలో నిర్దేశించిన సమిష్టి నిర్ణయాల సూత్రాలు మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# వెంకటాద్రి రాకపోకలకు శాశ్వత పరిష్కారం

- కొండచరియలతో దెబ్బతిన్న మార్గం పరిశీలన
- వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ



పెందుర్తి మండలంలోని వెంకటాద్రి కొండపై రాకపోకల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి రిటైనింగ్ వాల్ దెబ్బతిన్న ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఉత్తరాంధ్ర తిరుపతిగా పేరొందిన వెంకటాద్రికి భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తారని, మార్గం దెబ్బతినడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రిటైనింగ్ వాల్ కొంతమేర దెబ్బతిన్నందున మరమ్మతులు ఆలస్యం చేయకుండా చేపట్టాల్సిన అవసరం ఉందని అధికారులను ఆదేశించారు.

## నిధులు తెచ్చి పనులు పూర్తి చేస్తాం

వెంకటాద్రి మార్గ సమస్యను జీవీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించి కొత్త రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని రమేష్‌బాబు స్పష్టం చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పనులను వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. ఈ పరిశీలనలో జీవీఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివ, సీనియర్ నాయకులు రాజా సుధాకర్, వెంకటాద్రి ఆలయ ప్రధాన అర్చకులు రామాంజనేయులు, దేవస్థానం చైర్మన్ కోరిబిల్లి సుందర్‌రావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు మడక బంగారురాజు, ముక్క సంతోష్ పాల్గొన్నారు. వెంకటాద్రి భక్తులు, స్థానిక కూటమి నాయకులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఫార్మా పెట్టుబడులపై పర్యావరణ హెచ్చరిక

- పటాన్‌చెరు అనుభవాలతో బొలిశెట్టి సూచనలు
- శాస్త్రీయ అధ్యయనాల తర్వాత..

ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఫార్మా, బల్క్ డ్రగ్ పెట్టుబడులను ఆహ్వానించే ముందు సమగ్ర పర్యావరణ, ప్రజారోగ్య అధ్యయనాలు నిర్వహించాలని పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గుజరాత్‌లో జరిగిన ఫార్మా రౌండ్‌టేబుల్‌లో మంత్రి నారా లోకేశ్ ఏపీలోని, ముఖ్యంగా నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌లో పెట్టుబడులకు ఆహ్వానం పలికిన నేపథ్యంలో ఈ సూచనలు చేశారు. తెలంగాణలోని పటాన్‌చెరు-బొల్లారం ఫార్మా పరిశ్రమల అనుభవాలను ఏపీ ప్రభుత్వం పాఠాలుగా తీసుకోవాలని కోరారు. నీరు, భూగర్భజలాలు, వ్యవసాయం, పారిశ్రామిక వ్యర్థాలు, ప్రజారోగ్యంపై సుదీర్ఘకాలంగా న్యాయపరమైన విచారణలు జరిగాయని గుర్తుచేశారు. యాంటీబయాటిక్ కాలుష్యం, యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్‌కు సంబంధించిన తీవ్ర ఆందోళనకర అంశాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు

# ఈసీ వివరణతో అపోహలకు చెక్

**ఎస్ఐఆర్ వివాదానికి తెర పడిందన్న చంద్రబాబు**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఎస్ఐఆర్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఏకగ్రీవ వివరణతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు ఎస్.ఎస్. సంధు, వివేక్ జోషి కలిసి తీసుకున్న నిర్ణయాలు సంస్థాగత నిబంధనలకు అనుగుణంగా జరిగాయని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థల సమగ్రత, విశ్వసనీయతపై ప్రజల్లో నమ్మకాన్ని ఈ వివరణ మరింత బలపరిచిందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

## రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు వద్దు

ఎన్నికల ప్రక్రియపై తప్పుడు అనుమానాలు సృష్టించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సీఎం అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం భారత్ ప్రజాస్వామ్య వ్యవస్థపై, ఎన్నికల ప్రక్రియపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం విచారకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలన్నీ సంప్రదాయబద్ధమైన సంస్థాగత విధానాలను అనుసరించి సమష్టిగా తీసుకున్నవేనని స్పష్టం చేశారు.

## ప్రజల తీర్పును గౌరవించాలి

ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. విజయం వచ్చినప్పుడు ఎలా స్వీకరిస్తామో, ఓటమి ఎదురైనప్పుడు కూడా అదే స్థాయిలో హుందాతనంతో వ్యవహరించడం నాయకత్వ లక్షణమని అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని నాయకులు కలిసి ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియపై నమ్మకాన్ని బలపరచడం ప్రతి రాజకీయ నాయకుడి సామూహిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# ఈసీ వన్ మ్యాన్ ఆటోక్రసీ

- ఎన్నికల పారదర్శకతపై వైసీపీ ప్రశ్నలు
- వైసీపీ నేత సాకే శైలజానాథ్ ఆరోపణలు



కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై తీవ్రమైన సందేహాలు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆరోపించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తోటి కమిషనర్ల అభిప్రాయాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 14 సందర్భాల్లో కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా నిర్ణయాలు కొనసాగించారని ఆయన ఆరోపించారు. ఆర్టికల్ 324 స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న సీఈసీని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు.

## ఏపీ పోలింగ్ లెక్కలపై ప్రశ్నలు

2024 ఏపీ ఎన్నికల పోలింగ్ శాతంలో భారీ తేడా కనిపించిందని శైలజానాథ్ పేర్కొన్నారు. పోలింగ్ ముగిసిన రోజు రాత్రి 11.45 గంటలకు 76.50 శాతం నమోదైనట్లు ప్రకటించిన తర్వాత, మే 17 నాటికి 81.66 శాతానికి ఎలా పెరిగిందని ప్రశ్నించారు. కేవలం 2 గంటల 15 నిమిషాల్లో 17.19 లక్షల ఓట్లు నమోదయ్యాయన్న లెక్కలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే వీవీప్యాట్ స్లిప్పుల విషయంలో కూడా ఆయన ఆరోపణలు చేశారు. అయితే ఈ అంశంపై ఈసీ అధికారికంగా 2024 ఏపీ ఎన్నికలకు సంబంధించిన వీవీప్యాట్ స్లిప్పులు ధ్వంసం చేయలేదని స్పష్టం చేసింది. లెక్కింపు అనంతరం స్లిప్పులను నిబంధనల ప్రకారం భద్రపరుస్తామని తెలిపింది.

## ఓటర్ల జాబితాలపై వైసీపీ డిమాండ్లు

ఎన్నికల కమిషనర్ల నియామక విధానాన్ని పునఃసమీక్షించి, ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభ ప్రతిపక్ష నేతలతో కూడిన కమిటీని పునరుద్ధరించాలని శైలజానాథ్ కోరారు. ఓటర్ల జాబితాల సవరణలో అవకతవకలు జరిగాయని, బతికున్న వారి పేర్లు తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏపీలో డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్లతో ఉన్న పాత జాబితాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు.

# ప్రొద్దుటూరు అభివృద్ధికి కేంద్రానికి కీలక ప్రతిపాదనలు



ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిసి పలు అంశాలతో వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా దువ్వూరు రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని, ప్రొద్దుటూరుకు కేంద్రీయ విశ్వవిద్యాలయం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని మిస్సింగ్ హైవే లింక్ రోడ్లను జాతీయ రహదారుల పరిధిలోకి తీసుకుని పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేలా చూడాలని రామ్మోహన్‌నాయుడును కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కేంద్ర స్థాయిలో సమన్వయం పెంచి ప్రొద్దుటూరుకు అవసరమైన కీలక ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌నాయుడు, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై పర్సు.. విద్యార్థుల నిజాయితీ



ప్రొద్దుటూరు గవిని సర్కిల్ వద్ద రోడ్డుపై కనిపించిన పర్సును సొంతం చేసుకోకుండా పోలీసులకు అప్పగించి ముగ్గురు పాఠశాల విద్యార్థులు నిజాయితీకి నిదర్శనంగా నిలిచారు. ఆదర్శ కాలనీకి చెందిన రాకేష్ (13), నవదీప్ (12), శుభం (12) రోడ్డుపై పడి ఉన్న పర్సును గుర్తించి వెంటనే ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్ఐ మధుసూదన్ రెడ్డికి పర్సును అందజేశారు. అందులో ఆధార్ కార్డు, రూ.720 నగదు, మరికొన్ని వస్తువులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆధార్ కార్డు వివరాల ఆధారంగా పర్సు ఆదర్శకాలనీకి చెందిన ఇల్లూరు రామచంద్రదిగా పోలీసులు గుర్తించారు. చిన్న వయసులోనే బాధ్యత, నిజాయితీ ప్రదర్శించిన విద్యార్థులను వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి, పోలీస్ సిబ్బంది అభినందించారు. దొరికిన వస్తువులను సొంతం చేసుకోకుండా యజమానికి చేరేలా చేయడం ఆదర్శప్రాయమని ప్రశంసించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లల్లో ఇలాంటి విలువలను పెంపొందించాలని పోలీసులు సూచించారు. విద్యార్థుల నిజాయితీ స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

# అంగన్వాడీల్లో పోషణపై బీజేపీ ఆరా




ప్రొద్దుటూరులో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా బీజేపీ నాయకులు పలు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు అందుతున్న పోషకాహారం, మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు కొనసాగుతున్న కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ పోషణ అభియాన్‌ను చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, కడప జిల్లా సేవా సంకల్ప అభియాన్ అధ్యక్షురాలు చేవూరు శారదమ్మ, ప్రొద్దుటూరు ఇన్‌చార్జ్ ముప్పె వెంకట్ నాయుడు రెడ్డి తదితరులు కేంద్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న ఆహారం, సిబ్బంది సమస్యలు, మౌలిక సదుపాయాలు, సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అంగన్వాడీల్లో గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని శారదమ్మ తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా సేవా కార్యక్రమాలు నిర్వహించడమే అభియాన్ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ఎం.కుమారి, జిల్లా కార్యదర్శి చిరంజీవిరెడ్డి, నగర నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కుడో జిల్లా అధ్యక్షుడిగా విద్యాసాగర్ ఎంపిక




ప్రొద్దుటూరులో వైఎస్సార్ కడప జిల్లా కుడో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగాయి. జిల్లా క్రీడా అధికారి, ఆంధ్రప్రదేశ్ కుడో ఫెడరేషన్ పరిశీలకుల సమక్షంలో జరిగిన ఎన్నికల్లో రామేశ్వరం విద్యాసాగర్ అధ్యక్షుడిగా, ఇల్లూరు పవన్‌కుమార్ ఉపాధ్యక్షుడిగా, లింగం సోలమన్ విశాల్ కార్యదర్శిగా, మంచాల సంపత్ సుకుమార్ కోశాధికారిగా, గుటం కిరణ్‌కుమార్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా చిత్రాల పృథ్వీకుమార్, జక్కల లక్ష్మీదేవి ఎంపికయ్యారు. నూతన కమిటీకి రాష్ట్ర కుడో అసోసియేషన్ అధ్యక్షుడు శశిధర్, డైరెక్టర్ అనురాధ అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా, పరవాడలో జరిగిన 6వ ఆంధ్రప్రదేశ్ కుడో టోర్నమెంట్‌లో కడప జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఆర్. సుశాంత్ సాగర్, ఎం. అభినవ్ ప్రణవ్, ఆర్. షర్మిల బంగారు పతకాలు సాధించగా, ఎం. జాసన్ సందేశ్ హోప్ వెండి పతకం గెలిచారు. వీరిలో ఎంపికైన విజేతలు నవంబర్‌లో అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ కుడో పోటీల్లో పాల్గొననున్నారు.

# ఇడుపులపాయలో వైసీపీలోకి చేరికలు



ఇడుపులపాయ పంచాయతీ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాల్లో మార్పు చోటుచేసుకుంది. మారుతినగర్‌కు చెందిన టీడీపీకి చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్నారు. పెద్దింటి చిన్న రెడ్డయ్య, పెద్దింటి బాబు, తుమ్మలూరు కుళ్లాయప్ప, బంగారు గంగయ్య, పెద్దింటి విష్ణువర్ధన్, యంగళ్ల విశ్వనాథ్, మామిళ్లపల్లి చిన్న కుళ్లాయప్ప తదితరులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఈ చేరికతో ఇడుపులపాయ పంచాయతీలో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీలో చేరిన వారితో ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడి స్థానిక పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని వారికి సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూర్వీకుల స్మరణకు పితృపక్షం



### నేటి నుంచి 15 రోజులు స్మరణ

హిందూ సంప్రదాయంలో పూర్వీకులను స్మరించుకునే పితృపక్షానికి ప్రత్యేక స్థానం ఉంది. భాద్రపద పౌర్ణమి తర్వాత ప్రారంభమై ఆశ్వయుజ అమావాస్యతో ముగిసే ఈ కాలాన్ని పితృకార్యాలకు అనుకూల సమయంగా భావిస్తారు. మరణించిన వ్యక్తి ఏ తిథిన పరమపదించారో, అదే తిథిన శ్రాద్ధం, తర్పణం చేయడం సంప్రదాయం. తిథి తెలియని సందర్భంలో పితృపక్ష అమావాస్యనాడు పిండప్రదానం, తర్పణం చేస్తారు. పూర్వీకులను గౌరవంగా స్మరించడం ద్వారా కుటుంబానికి శాంతి, సౌభాగ్యం కలుగుతాయని ఆధ్యాత్మిక విశ్వాసం ఉంది.

**పితృదోషంపై సంప్రదాయ నమ్మకాలు**

కుటుంబంలో తరచూ కలహాలు, అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, పనుల్లో ఆటంకాలు, వివాహంలో జాప్యం, సంతాన సంబంధిత సమస్యలు ఎదురైతే వాటిని కొందరు పితృదోషానికి సంకేతాలుగా భావిస్తారు. అయితే ఇవి సంప్రదాయ విశ్వాసాలకు సంబంధించిన అంశాలే. పితృపూజ సమయంలో మాంసాహారాన్ని నివారించడం, పూజా నైవేద్యాలకు మట్టి పాత్రలు లేదా ఆకులను ఉపయోగించడం, పూజకు ఆటంకం కలిగించకుండా ఉండడం, ఇంటి పెద్దలను గౌరవించడం వంటి నియమాలను పాటించాలని ఆచారాలు చెబుతున్నాయి.

**తర్పణం..**

**పిండప్రదానం ఎలా**

పితృపక్షంలో పూర్వీకుల పేరుతో తర్పణం, పిండప్రదానం, అన్నదానం చేయడం ముఖ్యమైన ఆచారాలుగా ఉన్నాయి. బ్రాహ్మణులకు భోజనం పెట్టడం, వస్త్రదానం చేయడం సంప్రదాయంలో భాగం. అమావాస్య నాడు పితృభోగం సమర్పించడం, సూర్యోదయ సమయంలో సూర్యునికి అర్ఘ్యం ఇవ్వడం, గాయత్రీ మంత్రాన్ని జపించడం, రావిచెట్టుకు నీరు, పాలు, పుష్పాలు, గంగాజలం, నల్లనువ్వులు సమర్పించడం వంటి ఆచారాలు కూడా ఉన్నాయి. గోవుకు బెల్లం, గోధుమలు అందించడం, పూర్వీకులను తలచుకుని చేసిన తప్పులకు క్షమాపణ కోరడం, వారి ఆశీస్సులు కోరడం వంటి సంప్రదాయాలు కొనసాగుతున్నాయి.

**ఆచారాల్లో శ్రద్ధే ప్రధానమని విశ్వాసం**

తర్పణ విధానంలో ముందుగా ఆత్మశుద్ధి, సంకల్పం చేస్తారు. కుశ, నువ్వులు, యవలు, అక్షతలతో సంకల్పం చేసి దేవతలు, ఋషులు, పితృదేవతలకు తర్పణం సమర్పిస్తారు. అనంతరం తండ్రి, తాత, ముత్తాత, తల్లి, అమ్మమ్మ, ఇతర పూర్వీకులు, బంధువులను స్మరించి నీటిని అర్పిస్తారు. సూర్యదేవుడికి అర్ఘ్యం,
దిక్పాలకులకు నమస్కారం చేసి చివరగా పూజా ప్రక్రియను భగవంతునికి సమర్పిస్తారు. పితృపక్షం మొత్తం పూర్వీకుల పట్ల కృతజ్ఞత, కుటుంబ సంప్రదాయాల పరిరక్షణ, వారి స్మరణకు అంకితమైన కాలంగా భావిస్తారు. ఆధునిక జీవనశైలిలో ఏడాది పొడవునా అన్ని పితృకార్యాలు చేయడం కష్టమయ్యే నేపథ్యంలో పితృపక్షాన్ని ప్రత్యేకంగా ఎంచుకుని పూర్వీకులను స్మరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

# "ఇంట్లో మాత్రం నా మాట చెల్లదు"

## సెహ్వాగ్ నవ్వుల పంచ్!



భారత క్రికెట్‌లో విధ్వంసక ఓపెనర్‌గా ప్రపంచానికి పరిచయమైన వీరేంద్ర సెహ్వాగ్.. ఇప్పుడు తన కుమారుడు ఆర్యవీర్ క్రికెట్ ప్రయాణాన్ని ఆసక్తిగా గమనిస్తున్నాడు. ఇటీవలే భారత్ అండర్19 జట్టులోకి అడుగుపెట్టిన ఆర్యవీర్.. ఆస్ట్రేలియా అండర్19తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో 109 పరుగులు చేసి తన సత్తా చాటాడు. తండ్రిలాగే దూకుడైన ఆరంభాలతో ఆకట్టుకున్నాడు. అయితే కుమారుడికి తాను సాంకేతిక అంశాల కంటే మైండ్‌సెట్‌పైనే ఎక్కువగా సలహాలు ఇస్తానని సెహ్వాగ్ వెల్లడించాడు. "అందరికీ దాదాపు ఒకే రకమైన నైపుణ్యాలు ఉంటాయి. కానీ ఆటలో పైకి తీసుకెళ్లేది మైండ్‌సెట్" అంటూ తన ఫిలాసఫీని వివరించాడు. అయితే తన మాటలను ఆర్యవీర్ ఎంతవరకు వింటాడన్న ప్రశ్నకు సెహ్వాగ్ నవ్వుతూ "మెయిన్ ఘర్ కీ ముర్గీ దాల్ బరాబర్ హూన్" అంటూ సరదాగా బదులిచ్చాడు. కోచ్ ఒకటి, ట్రైనర్ మరొకటి, ఫిజియో ఇంకో సలహా ఇస్తుంటారని, పది మంది పది మాటలు చెబుతారని.. వాటిలో తనకు సరైనదేదో ఆటగాడే గుర్తించాలంటూ కుమారుడికి చెబుతానన్నాడు. 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ విజేతగా, దాదాపు 17 వేల అంతర్జాతీయ పరుగులతో దిగ్గజంగా నిలిచిన సెహ్వాగ్ వారసత్వాన్ని కొనసాగించేందుకు ఆర్యవీర్ ఇప్పుడు తొలి అడుగులు వేస్తున్నాడు.

# రైల్వే స్టేషన్‌లో పోలీస్ సేవలు మరింత చేరువ




విశాఖపట్నం రైల్వే స్టేషన్ లో 'మీ పోలీస్.. మీ ఫ్రెండ్' డిజిటల్ ఈఫిర్యాదుల కియాస్క్ ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ కు వెళ్లకుండానే ప్రయాణికులు ఫిర్యాదులు చేసేందుకు ఈ సదుపాయం కల్పించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో వాయిస్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. చదువురాని వారు సైతం సులభంగా వినియోగించుకునేలా రూపొందించారు. రోజుకు సుమారు 1.5 లక్షల మంది రాకపోకలు సాగించే విశాఖ రైల్వే స్టేషన్ లో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని హోంమంత్రి తెలిపారు. పీజీఆర్ ఎస్ కు అనుసంధానించిన ఈ కియాస్క్ తో ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారంలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. మారుతున్న నేరాల స్వభావానికి అనుగుణంగా ఏపీ పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారని చెప్పారు. విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ రైల్వే స్టేషన్ తో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ లోనూ ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ ఇడ్లీలపై వేంపల్లెలో ఫిర్యాదు



వేంపల్లెలో ఇడ్లీ తయారీకి ప్లాస్టిక్ షీట్లు, ఫుడ్‌గ్రేడ్ అవునో కాదో స్పష్టతలేని పదార్థాలు వినియోగిస్తున్నారన్న ఆరోపణలపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వేడి ఆవిరిలో ఆహారంతో నేరుగా తాకే పదార్థాల వినియోగంపై సమగ్ర తనిఖీలు చేపట్టి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు. అందెల రఘునాథ్‌రెడ్డి, కదిరి మహేష్, గోవిందు నీలకంఠ, పూర్ణచంద్రారెడ్డి, సింగం హరీష్‌రెడ్డి తదితరులు డీడీవో, వేంపల్లె స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో సమక్షంలో డిప్యూటీ ఎంపీడీవో రమణయ్యకు వినతి పత్రం అందజేశారు. వేంపల్లెతో పాటు పరిసర ప్రాంతాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, ఇడ్లీ తయారీలో ఉపయోగించే పదార్థాలు ఆహార వినియోగానికి సురక్షితమైనవో కాదో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. హోటల్ యాజమాన్యాలకు ఫుడ్‌గ్రేడ్ పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు కూడా అనుమానాస్పద ఆహార తయారీని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

# తొండూరు గురుకులంలో విద్యార్థినులకు అస్వస్థత

తొండూరు డా. బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో భోజనం అనంతరం 20 మందికి పైగా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని తొండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఘటనపై సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు ఆందోళన వ్యక్తం చేశారు. ఆహారం నాణ్యత, తాగునీరు, బాత్రూంలు, డైనింగ్ హాల్ పరిశుభ్రతపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హాస్టల్ నిర్వహణపై విద్యార్థినులు, తల్లిదండ్రులు గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. బాత్రూంల నిర్వహణ సరిగా లేక ఇంటర్మీడియట్ విద్యార్థులు టీసీలు తీసుకుని హాస్టల్ వదిలిన ఘటనను గుర్తుచేశారు. సుమారు 500 మందికి పైగా విద్యార్థినులు ఉన్న గురుకులంలో ఆరోగ్యం, భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అస్వస్థతకు అసలు కారణాన్ని వైద్యపరంగా నిర్ధారించి, ఆహారం, నీరు, పారిశుద్ధ్యం, హాస్టల్ నిర్వహణపై తనిఖీలు చేపట్టాలని సూచించారు.



# కోనేట్లో మునిగి ముగ్గురు చిన్నారుల మృతి

విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం మెరకముడిదాం మండలం బుధరాయవలసలో విషాద ఘటన చోటుచేసుకుంది. కోనేట్లో స్నానానికి వెళ్లిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మృతులను శంకరాపు వెంకటేష్, సరిది చంద్రశేఖర్, మండల హేమచంద్రరావుగా గుర్తించారు. స్నానం కోసం కోనేట్లోకి దిగిన సమయంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో నీటిలో గాలింపు చేపట్టి ముగ్గురు చిన్నారుల మృతదేహాలను బయటకు తీసినట్లు తెలుస్తోంది. అనంతరం పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు. ఒకే ఘటనలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో బుధరాయవలస గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. చిన్నారుల మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన గ్రామస్తులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కోనేట్లో ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, చిన్నారులు అక్కడికి వెళ్లిన వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గురుకుల బాలికల ఆరోగ్యంపై ఎమ్మెల్సీ ఆరా



తొండూరు మండలంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల హాస్టల్ లో విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి వెంటనే స్పందించారు. హాస్టల్ ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అస్వస్థతకు గురైన బాలికలను అంబులెన్స్ లో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం అందేలా వైద్యాధికారులతో మాట్లాడారు.

ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఘటనకు కారణాలపై తల్లిదండ్రులు, పాఠశాల, హాస్టల్ సిబ్బంది, సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. ప్రతి విద్యార్థినికి అవసరమైన వైద్యం అందుతుందా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. బాలికలందరూ త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

# మైనారిటీల ఆస్తులకు రక్షణ కల్పించాలి




విశాఖలో పర్యటించిన జాతీయ మైనారిటీ కమిషన్ వైస్ చైర్మన్ మునావరి బేగంను పలు దళిత, క్రైస్తవ, ముస్లిం, సిక్కు సంఘాల ప్రతినిధులు కలిసి తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. క్రిస్టియన్ మైనారిటీ జేఏసీ చైర్మన్ డాక్టర్ అనిల్‌పాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చర్చిలు, మసీదుల కూల్చివేతలు నిలిపివేయాలని, మైనారిటీల ఆస్తులకు రక్షణ కల్పించాలని సంఘాల నేతలు కోరారు. ఆకివీడులో 24 చర్చిలు, మూడు మసీదులు కూల్చివేశారని విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. తోట్లకొండ బౌద్ధ వారసత్వ ప్రాంతంపై కూడా ఫిర్యాదు చేశారు. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ క్రైస్తవుల ఆస్తుల పరిరక్షణతో పాటు క్రిస్టియన్, ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని కోరారు. వినతుల్లోని అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని మునావరి బేగం హామీ ఇచ్చారు. ఏపీ నుంచి ఇలాంటి సమస్యలు ఇంతకు ముందు కమిషన్ దృష్టికి రాలేదని ఆమె పేర్కొన్నారు.



ఒకప్పుడు నిషేధిత జాబితాలో ఉన్న భూమి.. ఇప్పుడు పట్టా భూమిగా ఎలా మారింది? ఒకప్పుడు ప్రభుత్వ భూమిగా ఆన్‌లైన్‌లో కనిపించిన అదే నేల.. రికార్డుల పేజీలు తిరిగేసరికి ప్రైవేటు హక్కుల గడపకు ఎలా చేరింది? సర్వే నంబర్ 430/1లోని ఈ భూమి కథలో ప్రతి మలుపు వెనుక ఓ ప్రశ్న.. ప్రతి రికార్డు వెనుక ఓ రహస్యం! పిల్లలు లేని అనసూయమ్మ రామకృష్ణను దత్తత తీసుకుంది. ఆమె మరణం తర్వాత వీలునామాతో హక్కులు అతనికి దక్కాయి. ఇదే సమయంలో ల్యాండ్ సీలింగ్ చట్టం కింద భూమి నిషేధిత జాబితాలోకి వెళ్లింది. కోర్టు తలుపు తట్టడంతో ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోకుండా ఆగిపోయింది. భూమి అక్కడే.. వివాదం అక్కడే.. కాలం మాత్రం పరుగులు తీసింది. తీరప్రాంతం అభివృద్ధి చెందింది. నేల ధర కోట్లకు ఎగబాకింది. అంతే.. నిద్రలో ఉన్న ఫైళ్లకు ఒక్కసారిగా కదలిక! నిషేధిత జాబితా నుంచి బయటపడేందుకు తెరవెనుక ప్రయత్నాలా? రాజకీయ అండదండలతో పావులు కదిలాయా? ఇప్పుడు అడంగల్‌లో 'పట్టా భూమి'.. అదీ 'నాన్ వన్ బీ'! భూమి మారిందా? రికార్డులే మారాయా? లేక రికార్డుల వెనుక ఎవరో కథనే మార్చారా? అసలు గుట్టు ఏమిటి?

# 50 కోట్ల భూమి స్వాహా

## దత్తతతో మొదలైన కథ

### రికార్డుల వెనుక గుట్టేంటి?

### కాగితాల్లో మాయాజాలం!

### రికార్డుల మార్పుతో మలుపు

**• అనసూయమ్మ నుంచి రామకృష్ణ.. హక్కుల కథ**

చీరాల తీర ప్రాంతంలో భూముల విలువ ఆకాశాన్నంటుతున్న వేళ.. ఒకప్పుడు ప్రభుత్వ రికార్డుల్లో కనిపించిన భూమి ఇప్పుడు ప్రైవేటు హక్కుల చుట్టూ ఎందుకు తిరుగుతోంది? 10.36 ఎకరాల భూమి.. ప్రస్తుత మార్కెట్ విలువ రూ.50 కోట్లకు పైగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆరోపిస్తున్న ఈ వ్యవహారంలో ఒక్కో రికార్డు తెరిచే కొద్దీ కొత్త ప్రశ్నలు బయటపడుతున్నాయి. సర్వే నంబర్ 438/1లోని రామాపురం భూమి అసలు ఎవరిది? 1973 ల్యాండ్ సీలింగ్ ప్రక్రియలో ప్రభుత్వానికి చేరిన భూమి తర్వాత ఎలా ప్రైవేటు హక్కుల్లోకి వెళ్లింది? దాని వెనుక తడవర్థి అనసూయమ్మ, ఆమె దత్తత కుమారుడిగా చెప్పబడుతున్న రామకృష్ణకు సంబంధించిన హక్కుల కథ ఏమిటి? ప్రభుత్వ భూమిగా ఉన్న రికార్డులు ఎప్పుడు మారాయి? 22ఏ నిషేధిత జాబితా నుంచి భూమి ఎలా బయటపడింది? ఈ ప్రశ్నలన్నీ ఇప్పుడు చీరాల రాజకీయాల్లోనే కాదు.. రెవెన్యూ వ్యవస్థలోనూ ప్రకంపనలు రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో కీలకంగా వినిపిస్తున్న పేరు అనసూయమ్మ. సర్వే నంబర్ 430/1కు సంబంధించిన భూమిపై ఆమెకు హక్కులు ఉన్నాయని చెబుతున్నారు. ఆమెకు సంతానం లేకపోవడంతో రామకృష్ణను దత్తత తీసుకున్నట్లు పేర్కొంటున్నారు. అనంతరం అనసూయమ్మ మరణించిన తర్వాత వీలునామా ద్వారా భూమిపై హక్కులను రామకృష్ణకు అప్పగించినట్లు వాదన ఉంది. అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. దత్తత ఎప్పుడు జరిగింది? దానికి సంబంధించిన చట్టబద్ధ పత్రాలు ఏమిటి? వీలునామా ఎప్పుడు తయారైంది? ఆ పత్రాలకు ప్రభుత్వ ల్యాండ్ సీలింగ్ రికార్డులతో ఉన్న సంబంధం ఏమిటి? ఒకవైపు కుటుంబ హక్కుల వాదన.. మరోవైపు ప్రభుత్వ భూ పరిమితి చట్టం.. ఈ రెండు దారులు ఎక్కడ కలిశాయన్నదే ఇప్పుడు తేలాల్సిన కీలక అంశం.

**• ఏళ్లుగా నిశ్శబ్దం.. ఒక్కసారిగా డిమాండ్?**

1973 ల్యాండ్ సీలింగ్ ప్రక్రియలో అనసూయమ్మకు సంబంధించిన భూముల్లో సీలింగ్ సర్‌ప్లస్ కింద సుమారు 26.5 ఎకరాలు ప్రభుత్వానికి వెళ్లే ప్రక్రియ జరిగినట్లు ఆమంచి కృష్ణమోహన్ ఆరోపిస్తున్నారు. అందులో 438/1లోని 10.36 ఎకరాలు కూడా ఉన్నాయని ఆయన చెబుతున్నారు. 1977 నుంచి ఈ భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లు పాత రికార్డులు సూచిస్తున్నాయని ఆయన వాదన. అంతేకాదు.. ఆ సమయంలో భూమిని నిషేధిత జాబితాలో ఉంచినా, ప్రభుత్వం భౌతికంగా స్వాధీనం చేసుకోలేదన్న అంశం కూడా ఈ కథలో మరో చిక్కు. కోర్టును ఆశ్రయించిన తర్వాత ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోకుండా ఆదేశాలు వచ్చినట్లు చెబుతున్నారు. దీంతో ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం భూమిని పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకోలేదు.. ప్రైవేటు హక్కుదారులు కూడా అక్కడ కార్యకలాపాలు సాగించలేదు.. భూమి మాత్రం రికార్డుల మధ్యలోనే చిక్కుకుపోయింది. కాలం మారింది. తీరప్రాంత అభివృద్ధి వేగం పెరిగింది. రోడ్లు, నివాస ప్రాంతాలు, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించడంతో భూముల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఇక్కడే పాత రికార్డుల్లో ఉన్న భూమిపై కొత్త ఆసక్తి మొదలైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు పట్టించుకోని భూమి.. కోట్ల రూపాయల విలువకు చేరిన తర్వాత దాని హక్కులపై కదలికలు ఎందుకు మొదలయ్యాయి? ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమిని నిషేధిత జాబితా నుంచి బయటకు తీసుకురావాల్సిన అవసరం ఎవరికి వచ్చింది? దానికి ఉపయోగించిన పత్రాలు ఏమిటి? ఎవరు సిఫారసు చేశారు? ఎవరి ఆదేశాలతో ప్రక్రియ ముందుకు వెళ్లింది? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభిస్తేనే అసలు కథలో మొదటి ముడి వీడుతుంది.

**• 22ఏ నుంచి బయటకు రావడంతో మలుపు**

ఇప్పుడు ఆన్‌లైన్ అడంగల్ రికార్డులను పరిశీలిస్తే భూమి 'పట్టా భూమి'గా కనిపిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో దాని స్థితిని 'నాన్ వన్ బీ'గా పేర్కొన్నట్లు చెబుతున్నారు. గతంలో ఇదే భూమి ప్రభుత్వ భూమిగా నమోదై ఉండగా.. ఇప్పుడు రికార్డు రూపం ఎలా మారింది? మార్పుకు ఆధారమైన పత్రం ఏది? పాత ల్యాండ్ సీలింగ్ రికార్డులు పరిశీలించారా? ప్రభుత్వానికి భూమి సరెండర్ అయిన వివరాలను ధృవీకరించారా? లేక తరువాత వచ్చిన ఏదైనా ఉత్తర్వు ఆధారంగా రికార్డు మార్చారా? భూమి కంటే ఇప్పుడు ఈ రికార్డు మార్పే పెద్ద ప్రశ్నగా మారింది. ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉంటే వాటి రిజిస్ట్రేషన్లపై ఆంక్షలు ఉంటాయి. అలాంటి జాబితాలో ఉన్న భూమి తర్వాత బయటకు రావాలంటే పత్రాలు, నివేదికలు, అధికారిక ఉత్తర్వులు అవసరం. ఈ భూమి విషయంలో 22ఏ నుంచి ఎలా తొలగించబడింది? తొలగింపునకు ఏ పత్రాలు సమర్పించారు? తహసీల్దార్ స్థాయి నుంచి ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ స్థాయి వరకు ఏ నివేదికలు వెళ్లాయి? పాత ల్యాండ్ సీలింగ్ చరిత్రను అధికారులు పరిశీలించారా? లేక అందుబాటులో ఉన్న తాజా రికార్డుల ఆధారంగానే నిర్ణయం తీసుకున్నారా? ఇవన్నీ పత్రాలతో బయటకు రావాల్సిన అంశాలే. ఆమంచి ఆరోపణల ప్రకారం ఈ ప్రక్రియలో అధికారుల స్థాయిలో కీలకమైన నిర్ణయాలు జరిగాయి. అయితే వాటి చట్టబద్ధతను అధికారిక రికార్డులే నిర్ధారించాల్సి ఉంది.

**• ఆర్డీఓ ఉత్తర్వులు.. భూమి హక్కుల్లో ట్విస్ట్**

2025 జనవరిలో అప్పటి చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు ఇచ్చిన ఉత్తర్వులపై ఆమంచి కృష్ణమోహన్ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఆ ఉత్తర్వుల కారణంగానే ప్రభుత్వ భూమిపై ప్రైవేటు హక్కులకు మార్గం ఏర్పడిందన్నది ఆయన ఆరోపణ. ప్రభుత్వ భూమి హక్కులను మార్చే అధికారం ఆర్డీఓ పరిధిలో ఉందా? ఉంటే ఏ చట్టం ప్రకారం? ఏ పాత ఉత్తర్వులను ఆధారంగా తీసుకున్నారు? ల్యాండ్ సీలింగ్ కేసు పూర్తి వివరాలను పరిశీలించారా? అన్నది ఇప్పుడు పరిశీలించాల్సిన అంశం. అధికారుల ఉత్తర్వులపై విమర్శలు రావడం ఒక విషయం.. వాటి చట్టబద్ధత తేలడం మరో విషయం. అందుకే ఆ ఉత్తర్వుల పూర్తి పాఠం, వాటికి జత చేసిన పత్రాలు బయటకు రావాల్సిన అవసరం ఉంది. ఇక్కడ అత్యంత ఆసక్తికరమైన మలుపు ఇదే. భూమికి సంబంధించిన కీలక ల్యాండ్ సీలింగ్ ఫైల్ ఆర్డీఓ కార్యాలయంలో కనిపించడం లేదని ఆమంచి ఆరోపిస్తున్నారు.

సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరిన సందర్భంలో ఈ విషయం బయటపడిందని ఆయన చెబుతున్నారు. రూ.50 కోట్లకు పైగా విలువైన భూమికి సంబంధించిన పాత రికార్డులు కనిపించకపోవడం నిజమైతే.. అది సాధారణ పరిపాలనా లోపమా? లేక మరింత లోతైన వ్యవహారానికి సంకేతమా? ఫైల్ చివరిసారిగా ఎవరి వద్ద ఉంది? ఎప్పుడు రికార్డు గదిలోకి వెళ్లింది? ఎప్పుడు బయటకు వచ్చింది? ఒక అధికారి నుంచి మరొక అధికారికి బాధ్యతలు అప్పగించినప్పుడు ఈ ఫైల్ హ్యాండోవర్ అయిందా? ఫైల్ మిస్సింగ్‌పై అధికారికంగా ఏమైనా నమోదు చేశారా? ఇవన్నీ దర్యాప్తుతో తేలాల్సిన ప్రశ్నలు.

**• రూ.50 కోట్ల భూమి కంటే.. అసలు విలువైనది రికార్డే**

ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పుడు భూమి విలువ కంటే రికార్డుల విలువ పెరిగింది. ఒకవైపు 1973 ల్యాండ్ సీలింగ్ చరిత్ర.. మరోవైపు ప్రభుత్వ ఆధీనానికి సంబంధించిన పాత రికార్డులు.. మధ్యలో దత్తత, వీలునామా వివాదం.. తర్వాత వచ్చిన అధికారుల ఉత్తర్వులు.. 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగింపు.. చివరికి ఆన్‌లైన్ అడంగల్‌లో మారిన భూమి స్వరూపం.. ఇవన్నీ ఒకదానితో ఒకటి ఎలా అనుసంధానమయ్యాయన్నదే అసలు కథ. ప్రతి దశకు సంబంధించిన పత్రం బయటకు వస్తేనే ఈ ముడి విప్పబడుతుంది. ఎక్కడైనా చట్టవిరుద్ధమైన మార్పు జరిగిందని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే అధికారిక రికార్డులు ఆ విషయాన్ని స్పష్టం చేయాలి. భూమి విలువ పెరిగిన తర్వాత రాజకీయ పలుకుబడితో నిషేధిత జాబితా నుంచి భూమిని బయటకు తీసుకొచ్చే ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే దీనికి సంబంధించిన నిర్ధారిత ఆధారాలు, పేర్లు, ఆదేశాలు, పత్రాలు బయటపడాల్సి ఉంది. ఆరోపణను నిజమని తేల్చేది రాజకీయ ప్రచారం కాదు.. ఫైల్‌లోని పత్రాలే. ఎవరు ఎవరిని కలిశారు అన్నదానికంటే.. ఎవరు ఏ పత్రంపై సంతకం చేశారు? ఏ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకున్నారు? ఏ చట్టం కింద హక్కు మారింది? అన్నదే అసలు విషయం. అక్కడే ఈ రూ.50 కోట్ల భూమిలో ట్విస్టులు తెలుస్తాయి.

**• చివరికి తేలాల్సింది ఒక్కటే.. భూమి ఎవరిది?**

ప్రభుత్వ భూమి అయితే అది ప్రభుత్వానికే చెందాలి. ప్రైవేటు హక్కు చట్టబద్ధంగా ఏర్పడిందంటే దానికి సంబంధించిన పత్రాలు బయటకు రావాలి. రికార్డుల్లో తప్పు జరిగితే సరిచేయాలి. ఫైల్ కనిపించకపోతే దాని బాధ్యత ఎవరిదో తేలాలి. 22ఏ నుంచి తొలగింపు చట్టబద్ధమైతే దానికి ఆధారాలు చూపాలి. లేకపోతే ఆ ప్రక్రియను తిరిగి ప్రారంభించాలన్నదే ఆమంచి కృష్ణమోహన్ డిమాండ్. అవసరమైతే న్యాయపోరాటానికి వెళ్తానని ఆయన ప్రకటిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల వివరణ ఇంకా కీలకం. చివరికి ఈ వ్యవహారంలో గెలుపు ఓటముల మాట కాదు.. ల్యాండ్ సీలింగ్ రికార్డు, సరెండర్ పత్రం, 22ఏ రిజిస్టర్, ఆర్డీఓ ఉత్తర్వు, దత్తత పత్రాలు, వీలునామా, రిజిస్ట్రేషన్ రికార్డులు, అడంగల్. ఆ పత్రాలన్నీ ఒకే మాట చెబితేనే అసలు నిజం బయటపడుతుంది. అప్పటి వరకు మాత్రం ఒకటే ప్రశ్న.. రూ.50 కోట్ల భూమి ఎవరిది?

- ఎం చంద్రశేఖర్, చీఫ్ రిపోర్టర్




**• దత్తత వివాదం.. భూమి హక్కులకు లింక్?**

అనసూయమ్మకు రామకృష్ణ దత్తత తీసుకున్న అంశం కూడా ఈ వ్యవహారంలో కీలకంగా మారింది. రామకృష్ణ 1979లోనే తాను అనసూయమ్మకు దత్తత వెళ్లినట్లు న్యాయస్థానాలను ఆశ్రయించారని ఆమంచి చెబుతున్నారు. అయితే అనసూయమ్మ జీవించి ఉన్న సమయంలో ఉన్న కొన్ని రికార్డుల్లో దత్తత అంశం కనిపించలేదన్నది ఆయన వాదన. 1979 నాటికి రామకృష్ణ వయస్సు 15 సంవత్సరాలు మాత్రమేనని కూడా ఆయన ప్రస్తావిస్తున్నారు. ఈ అంశాలపై తుది నిర్ణయం మాత్రం సంబంధిత న్యాయపత్రాలు, దత్తత పత్రాలు, వీలునామా, అప్పటి రెవెన్యూ రికార్డులు పరిశీలించిన తర్వాతే సాధ్యం. ఎందుకంటే కుటుంబ వారసత్వ హక్కు ఒక అంశం.. ల్యాండ్ సీలింగ్ చట్టం కింద ప్రభుత్వానికి చేరిన భూమిపై హక్కు మరో అంశం. ఈ రెండింటిని ఏ పత్రం కలిపిందన్నదే అసలు చిక్కు.

ప్రభుత్వ భూముల రికార్డులు మారుతున్నాయన్న ఆరోపణలపై ఆమంచి తీవ్రంగా స్పందిస్తున్నారు. తనలాంటి మాజీ ఎమ్మెల్యేనే రికార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే సామాన్యుడి పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నిస్తున్నారు. తన వద్ద చీరాల నియోజకవర్గానికి సంబంధించిన పాత రెవెన్యూ రికార్డులు ఉన్నాయని, అధికారిక రికార్డులతో వాటిని సరిపోల్చి అవసరమైతే ఆధారాలు బయటపెడతానని చెబుతున్నారు. గతంలోనూ రెవెన్యూ రికార్డుల విషయంలో తాను జోక్యం చేసుకున్న సందర్భాలు ఉన్నాయని ఆయన గుర్తుచేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు పూర్తి సమాధానం ఇవ్వాల్సింది సంబంధిత రెవెన్యూ అధికారులే. ఏ రికార్డు సరైనది? ఏ ఉత్తర్వు చట్టబద్ధమైనది? ఏ మార్పు ఎప్పుడు జరిగింది?





# ఖైరతాబాద్‌లో ఎవరిది పైచేయి?

## ఉపఎన్నికతో గ్రేటర్‌లో నయా జోష్

ఖైరతాబాద్ ఉపఎన్నికకు రాజకీయ రంగం సిద్ధమవుతున్న కొద్దీ హైదరాబాద్ రాజకీయాల్లో ఆసక్తి పెరుగుతోంది. ఇది కేవలం ఒక ఎమ్మెల్యే స్థానానికి జరిగే ఎన్నికగా మాత్రమే కనిపించడం లేదు. అధికార కాంగ్రెస్ బలం, బీఆర్ఎస్ పునరాగమన ప్రయత్నం, బీజేపీ విస్తరణ వ్యూహం, కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని కొత్త టీఆర్ఎస్ ప్రభావం, చిన్న పార్టీల ఓటు చీలిక.. ఇవన్నీ ఒకే వేదికపై పరీక్షకు రాబోతున్నాయి. దానం నాగేందర్ 2023లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి 67,368 ఓట్లు సాధించి గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డికి 45,358 ఓట్లు, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డికి 38,094 ఓట్లు వచ్చాయి. దానం విజయం 22,010 ఓట్ల ఆధిక్యంతో నమోదైంది. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దానం పార్టీ మార్పు, అనర్హత వివాదం, న్యాయపోరాటం తర్వాత ఉపఎన్నిక అనివార్యమైన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ హైకోర్టు ఆయనను 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హుడిగా ప్రకటించిన నేపథ్యంలో విషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. తాజా పరిణామాలు ఖైరతాబాద్‌ను రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక చర్చగా నిలిపాయి. అందుకే ఈ ఎన్నికలో గెలుపు కంటే ఎవరి రాజకీయ బలం ఎంత ఉందన్నదే అసలు పరీక్షగా మారుతోంది. ఇదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సమీకరణాల వేళ ఈ ఉపఎన్నిక వ్యవహారం చర్చనీయాంశమవుతోంది. ఉప ఎన్నిక ముందు వస్తుందా? గ్రేటర్ ఎన్నికల తర్వాతా? అనే చర్చ ఈ పోరును మరింత రసవత్తరంగా మార్చుతోంది. ఖైరతాబాద్‌లో పడే ప్రతి ఓటు భవిష్యత్ నగర రాజకీయాలను మార్చే శక్తి ఉందని మాత్రం చెప్పొచ్చు.

PCS Beyond Data

### • దానం ముందు గెలుపుతో పాటు వ్యక్తిగత పరీక్ష

కాంగ్రెస్ తరఫున దానం నాగేందర్ మళ్లీ బరిలోకి దిగే అవకాశాలపై ఇప్పటికే విస్తృత చర్చ జరుగుతోంది. 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఇదే అంశం ఆయనపై అనర్హతకు దారితీసింది. ఇప్పుడు అదే ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా తిరిగి ప్రజల ముందుకు వెళ్లాల్సి వస్తే, ఆయన ప్రచారం ప్రధానంగా స్థానిక పనులు, వ్యక్తిగత పరిచయాలు, నియోజకవర్గంలో తనకు ఉన్న సంస్థాగత బలం చుట్టూ తిరిగే అవకాశం ఉంది. అయితే ప్రతిపక్షాలు మాత్రం "బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లారు?" అనే ప్రశ్నను ముందుకు తెచ్చే అవకాశం ఉంది. ఆయారాం గయారాం చర్చ ప్రచారంలో ప్రధాన అంశంగా మారవచ్చు. మరోవైపు దానం గత రెండు ఎన్నికల్లో ఖైరతాబాద్‌లో తనకంటూ ఓటు బేస్ నిర్మించుకున్న విషయం గణాంకాలు చెబుతున్నాయి. 2018లో ఆయనకు 63,068 ఓట్లు, 44.56 శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీకి చెందిన చింతల రామచంద్రారెడ్డి 34,666 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. 2023లో కూడా దానం 43.48 శాతం ఓట్లతో విజయం సాధించారు. అయితే ఉపఎన్నికలో అదే ఓటు శాతం తిరిగి వస్తుందని చెప్పడం సాధ్యం కాదు. అభ్యర్థి పార్టీ మార్పు, ప్రభుత్వ పనితీరు, స్థానిక సమస్యలు, ప్రతిపక్ష ఓట్ల సమీకరణం అన్నీ కలిసి కొత్త లెక్కలు తయారు చేయవచ్చు. అందువల్ల దానం ఎదుర్కొనే అసలు సవాలు కేవలం ప్రత్యర్థి అభ్యర్థి కాదు.. తనపై ఏర్పడే రాజకీయ కథనాన్ని ఎలా ఎదుర్కొంటారన్నదే.

### • బీఆర్ఎస్‌కు అభ్యర్థి ఎంపికే తొలి పరీక్ష

బీఆర్ఎస్‌కు ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రత్యేకమైన రాజకీయ అవకాశం. ఒకప్పుడు ఈ ప్రాంతంలో కాంగ్రెస్ ఆధిపత్యం ఉన్నప్పటికీ, గత దశాబ్దంలో నియోజకవర్గం ఓటింగ్ ధోరణిలో గణనీయమైన మార్పులు వచ్చాయి. 2014లో బీజేపీకి చెందిన చింతల రామచంద్రారెడ్డి 53,102 ఓట్లతో గెలిచారు. 2018, 2023లో బీఆర్ఎస్ తరఫున దానం నాగేందర్ వరుసగా విజయం సాధించారు. అంటే 2014 తర్వాత ఈ సీటు ఒకే పార్టీకి శాశ్వత కోటగా మారలేదన్న విషయం స్పష్టమవుతోంది. ఇప్పుడు బీఆర్ఎస్ ముందు ప్రధాన ప్రశ్న ఎవరిని బరిలోకి దింపాలి? అన్నదే. పీజేఆర్ తనయుడు పి. విష్ణువర్ధన్ రెడ్డి పేరు చర్చలో ఉంది. పీజేఆర్ కుటుంబానికి పాత ఖైరతాబాద్‌తో ఉన్న అనుబంధం ఈ ఎంపికకు రాజకీయ ప్రాధాన్యం ఇస్తోంది. విష్ణువర్ధన్ రెడ్డి 2008 ఉపఎన్నికలో ఖైరతాబాద్ నుంచి గెలిచిన తర్వాత 2009లో ఏర్పడిన జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి వెళ్లారు. బీఆర్ఎస్‌లో మాత్రం ఇతర సీనియర్ నేతల పేర్లు కూడా చర్చకు వస్తున్నట్లు వార్తలు ఉన్నాయి. అభ్యర్థి విష్ణువర్ధన్ రెడ్డి అయితే "పీజేఆర్ వారసత్వం వర్సెస్ దానం వ్యక్తిగత ఓటు బలం" అనే పోరు రూపుదిద్దుకోవచ్చు. మరో సీనియర్ నేతను ఎంపిక చేస్తే పార్టీ సంస్థాగత బలంపై దృష్టి పెరిగే అవకాశం ఉంటుంది. బీఆర్ఎస్‌కు మరో సవాలు కవిత నేతృత్వంలోని కొత్త టీఆర్ఎస్ రాజకీయ ఉనికి. గతంలో బీఆర్ఎస్ వైపు ఉన్న కొన్ని వర్గాలు కొత్త రాజకీయ వేదిక వైపు మళ్లితే ఓట్ల లెక్క మారే అవకాశం ఉంది. అందుకే బీఆర్ఎస్‌కు ఈ ఉపఎన్నిక అభ్యర్థి ఎంపిక నుంచే మొదలయ్యే పరీక్ష.

### • బీజేపీకి పాత గెలుపు జ్ఞాపకం.. కొత్త సవాల్

ఖైరతాబాద్‌లో బీజేపీకి చరిత్ర ఉంది. 2014లో చింతల రామచంద్రారెడ్డి విజయం సాధించడం ఆ పార్టీకి ఈ నియోజకవర్గంలో ఉన్న సామర్థ్యానికి ఒక ముఖ్యమైన ఉదాహరణ. 2014లో ఆయన 37 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించి గెలిచారు. 2018లో దానం నాగేందర్ చేతిలో ఓడిపోయినా 34,666 ఓట్లు సాధించారు. 2023లో కూడా చింతల 38,094 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇప్పుడు మళ్లీ ఆయన పేరు బీజేపీ శిబిరంలో ప్రముఖంగా వినిపిస్తోంది. దీంతో బీజేపీ ప్రచారంలో రెండు వేర్వేరు కథనాలు కనిపించే అవకాశం ఉంది. ఒకటి 2014లో ఇదే నియోజకవర్గాన్ని గెలిచిన పార్టీగా తన గత రికార్డును గుర్తు చేయడం, రెండోది ఫిరాయింపు రాజకీయాలపై ప్రశ్నలు లేవనెత్తడం. కేంద్ర నాయకత్వం, హైదరాబాద్‌లో పార్టీ విస్తరణ, నగర ఓటర్లలో బీజేపీకి పెరిగిన రాజకీయ గుర్తింపు వంటి అంశాలు కూడా ప్రచారంలో ప్రస్తావనకు రావచ్చు. అయితే 2023లో బీజేపీ ఓట్ల సంఖ్య పెరిగినా, బీఆర్ఎస్ విజయానికి చేరువ కాలేకపోయింది. అందువల్ల బీజేపీకి ఇప్పుడు ముఖ్యమైన ప్రశ్న ఓట్లను పెంచుకోవడమే కాదు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరిగే పోరులో తన ఓటు శాతాన్ని ఎలా నిలబెట్టుకుంటుందన్నది. త్రిముఖ పోరులో ప్రతి పార్టీకి 30-40 వేల ఓట్ల స్థాయి కూడా కీలకంగా మారే పరిస్థితి ఏర్పడితే, గత ఎన్నికల కంటే చిన్న మార్పులు కూడా ఫలితాన్ని ప్రభావితం చేయవచ్చు. అయితే ఎవరు గెలుస్తారన్నది ముందుగా నిర్ణయించలేం.

### • గ్రేటర్ ముందు ఉపఎన్నిక.. అసెంబ్లీ ముందస్తు ట్విస్ట్?

ఖైరతాబాద్ ఉపఎన్నికను కేవలం స్థానిక పోరుగా చూస్తే అసలు రాజకీయ చిత్రం పూర్తిగా కనిపించదు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఖైరతాబాద్‌లో మొత్తం 2,96,036 మంది నమోదిత ఓటర్లు ఉండగా, 1,54,945 మంది ఓటు వేశారు. పోలింగ్ శాతం 52.34గా నమోదైంది. ఈ నియోజకవర్గంలో గత మూడు అసెంబ్లీ ఎన్నికలను చూస్తే 2014లో బీజేపీ, 2018లో బీఆర్ఎస్, 2023లో బీఆర్ఎస్ గెలిచాయి. అంటే ఇక్కడ ఓటర్లు ఒకే పార్టీకి శాశ్వతంగా కట్టుబడి ఉన్నారని చెప్పే పరిస్థితి లేదు. ఇదే కారణంగా ఉపఎన్నికను పార్టీలు తమ బలాబలాల కొలమానంగా చూడవచ్చు. కాంగ్రెస్‌కు ఇది అధికారంలో ఉన్న సమయంలో నగర నియోజకవర్గంలో తన పరిపాలనకు ప్రజల స్పందన తెలుసుకునే అవకాశం. బీఆర్ఎస్‌కు ఓటమి తర్వాత నగరంలో తిరిగి పుంజుకునే ప్రయత్నానికి వేదిక. బీజేపీకి 2014లో గెలిచిన సీటులో తన ప్రస్తుత నగర రాజకీయ బలాన్ని పరీక్షించుకునే అవకాశం. కవిత పార్టీకి కొత్త రాజకీయ గుర్తింపును నిర్మించుకునే పరీక్ష. చిన్న పార్టీలకు తమ సిద్ధాంతాలను నగర ఓటర్ల ముందు ఉంచే అవకాశం. అయితే గ్రేటర్ ఎన్నికలు ముందా, ఉపఎన్నిక ముందా, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌లో ఏదైనా మార్పు వస్తుందా అన్న అంశాలపై అధికారిక ఎన్నికల ప్రకటన వచ్చే వరకు కచ్చితమైన నిర్ణయం చెప్పడం సాధ్యం కాదు. రాజకీయంగా మాత్రం ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఖైరతాబాద్ ఫలితం ఏ పార్టీకి వచ్చినా, దాని ప్రభావం ఖైరతాబాద్ సరిహద్దులు దాటి హైదరాబాద్ రాజకీయ చర్చలోకి వెళ్లే అవకాశం ఉంది. దానం నాగేందర్ తన వ్యక్తిగత బలాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ తన పాత ఓటు బేస్‌ను తిరిగి సమీకరించాల్సి ఉంటుంది. బీజేపీ తన 2014 విజయాన్ని ప్రస్తుత రాజకీయ వాస్తవాలతో అనుసంధానించాలి. కవిత పార్టీ తనకు ఉన్న కొత్త రాజకీయ స్థలాన్ని చూపించాలి. చివరికి అసలు ట్విస్ట్ అభ్యర్థుల ప్రకటనలో కాదు.. ఓటర్లు ఏ అంశాన్ని ప్రధానంగా తీసుకుంటారన్నదానిలో ఉంటుంది.

## అదరగొట్టిన PCS సర్వే

**అక్షర సత్యమైన పీసీఎస్ సర్వే... సర్వే వందుకు వంద శాతం కరెక్ట్**

**పీసీఎస్ సర్వే చెప్పినట్టుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు ప్రఖ్యాత డిజిటల్ చానెల్ స్వేచ్ఛతో కలిసి, పీసీఎస్ సర్వే ప్రభంజనం స్థాపించిన మొదటి సంవత్సరమే అద్భుత విజయం**

హైదరాబాద్ (సహవాసి న్యూస్) : మాటలు చెప్పడం వేరు. చేతల్లో చూపించడం వేరు. ఎన్నికల్లో సర్వే సంస్థల అంచనాలు విఫలమవుతున్న తరుణంలో కొత్తగా వచ్చిన PCS సర్వే అదరగొట్టింది. ప్రఖ్యాత డిజిటల్ చానెల్ స్వేచ్ఛతో కలిసి, PCS సర్వే ప్రభంజనం సృష్టించింది. PCS సర్వే అక్షర సత్యమైంది. స్థాపించిన మొదటి సంవత్సరమే అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సర్వే నిర్వహించిన పొలిటిక్స్ కమ్యూనికేషన్ అండ్ స్ట్రాటజీస్ PCS జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సర్వే వందుకు వంద శాతం కరెక్ట్ అయ్యింది. సీనియర్ సెఫాలజిస్టులతో జూబ్లీహిల్స్ పబ్లిక్ పల్స్ అంచనా వేయడంలో విజయం సాధించింది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి 49 శాతం ఓట్లు గెలుచుకోవచ్చని సర్వే అంచనా వేసింది. 49 శాతానికి 2 శాతం ఓట్లు తగ్గొచ్చు. పెరగొచ్చని సర్వే తెలిపింది. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీకి 42 శాతం ఓట్లు రావొచ్చని, 2 శాతం తగ్గొచ్చు, లేదంటే పెరగొచ్చని సర్వే అంచనా వేసింది. ఇక బీజేపీకి సైతం 8 శాతం ఓట్లు వస్తాయని 2 శాతం తగ్గొచ్చు, లేదా పెరగొచ్చని విశ్లేషించింది. ఇక ఇతరులకు ఒక శాతం మేర ఓట్లు రావొచ్చని సర్వే ప్రెడిక్ట్ చేసింది. PCS సర్వే చెప్పినట్టుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు వచ్చాయి. నవీన్ యాదవ్ సుమారుగా 50 శాతం ఓట్ల 25 వేల మెజార్టీతో ఎన్నికల్లో విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లు 1,94,727... కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కి వచ్చిన ఓట్లు 98988. PCS అంచనా 51% రియల్ పోల్‌లో వచ్చిన 51 శాతం ఓట్లు పీసీఎస్ అంచనా వేసినట్టుగా నవీన్ మెజార్టీ సుమారుగా 25 వేలు.

ఇప్పుడు నవీన్ యాదవ్ 24,729 ఓట్లతో విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థికి వచ్చిన ఓట్లు 74259, వచ్చిన పర్సెంటేజ్ 38.13 PCS అంచనా 40% బీజేపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు 17061 వచ్చిన పర్సెంటేజ్ 8.76 PCS అంతనా 8%. అందరిలాగా మేమే తోపులం. మేం చేసిందే కరెక్ట్ అని చెప్పం. మేం అంచనా వేసినట్టుగా 98 శాతం మా సర్వే సక్సెస్ అయ్యింది. పేరు మోసిన సర్వేలకంటే ఎక్యురసీతో PCS సత్తా చాటింది.




### • పీసీఎస్ సర్వే.. ఖైరతాబాద్‌లో కొత్త లెక్కలు

గత అంచనాకు కొనసాగింపుగా ఖైరతాబాద్‌పై పీసీఎస్ సర్వే ఆసక్తికరమైన ఓటు లెక్కలను వెల్లడించింది. పీసీఎస్ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2025 జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు ముందు నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్‌కు 49 శాతం +/-2, బీఆర్ఎస్‌కు 42 శాతం +/-2, బీజేపీకి 8 శాతం +/-2, ఇతరులకు 1 శాతం +/-1 ఓట్లు వస్తాయని అంచనా వేసింది. అనంతరం వెలువడిన జూబ్లీహిల్స్ ఫలితాల్లో కాంగ్రెస్ 50.8 శాతం, బీఆర్ఎస్ 38.1 శాతం, బీజేపీ 8.7 శాతం ఓట్లు సాధించాయి.. అంటే ప్రధాన పార్టీల ఓట్ షేర్‌ను పీసీఎస్ వందకు వంద శాతం అంచనా వేసింది. అదే అనుభవాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఖైరతాబాద్ ఉపఎన్నికపై పీసీఎస్ గత ఏడాది డిసెంబర్ 22 నుంచి 27 మధ్య నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్‌కు 43 శాతం +/-3, బీజేపీకి 32 శాతం +/-3, బీఆర్ఎస్‌కు 26 శాతం +/-3, ఇతరులకు 1 శాతం +/-1 ఓట్లు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. అంటే పీసీఎస్ అంచనా ప్రకారం ప్రస్తుతం ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ ముందంజలో ఉండగా, బీజేపీ రెండో స్థానంలో, బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉన్నట్లు సర్వే చెబుతోంది. అయితే ఇది సుమారుగా 9 నెలల క్రితం. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితుల్లో చాలా చాలా మార్పులు వచ్చాయ్. ప్రభుత్వం కూడా మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఖైరతాబాద్‌లో 2014లో బీజేపీ.. టీడీపీతో పొత్తుతో గెలిస్తే.. 2018లో బీఆర్ఎస్, 2023లో మళ్లీ బీఆర్ఎస్ పక్షాన దానం నాగేందర్ గెలిచారు. 2023లో దానం నాగేందర్‌కు 43.8 శాతం, కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డికి 29.3 శాతం, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డికి 24.8 శాతం ఓట్లు రాగా.. ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు కన్పిస్తోంది. ఇప్పుడు దానం కాం[illegible] వైపు ఉండటం [illegible] చేయాల్సి రావడం, బీజే[illegible] చర్చలో ఉండటం నేప[illegible] కొత్తగా సర్వే నిర్వహించాల[illegible] ఫలితాల కోసం నా దేశం పత్రి[illegible]

### అందనంత దూరంలో కేకే సంస్థ అంచనా..

ఇక కొన్ని సంస్థలు కాంగ్రెస్ ఓడిపోతుందని, బీఆర్ఎస్ మెజారిటీ సాధిస్తుందని అంచనాలను విడుదల చేశాయి. అలాంటి సంస్థల్లో కేకే సర్వే ముఖ్యమైనది. బీఆర్ఎస్‌కు 33,866 ఓట్ల మెజారిటీ వస్తుందని కేకే సర్వే పేర్కొంది. క్యూమెగా, నేషనల్ ఫ్యామిలీ ఒపీనియన్, మిషన్ చాణక్య వంటి సంస్థలు కూడా బీఆర్ఎస్ పార్టీనే గెలుస్తుందని చెప్పాయి.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల శాతంపై ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు**

| | సంస్థ పేరు | కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ |
|---|---|---|---|---|
| 1. | ఆరా | 47.49 (+,-3) | 39.25(+,-3) | 9.31(+,-2) |
| 2 | స్మార్ట్ | 48.2 | 42.1 | 7.6 |
| 3. | నాగన్న | 47.84 | 41.46 | 8.71 |
| 4. | చాణక్య స్ట్రాటజీస్ | 46 | 43 | 6 |
| 5. | పీ ఆర్ ఎవర్ మీడియా | 47.41 | 43.13 | 7.91 |
| 6. | పీసీఎస్ | 49 | 42 | 8 |
| 7. | ఆత్మసాక్షి | 46.5 | 41 | 6 |
| 8. | కేకే సర్వే | 37.8 | 55.2 | 7 |
| 9. | క్యూ మెగా | 41 | 45 | 9 |
| 10. | నేషనల్ ఫ్యామిలీ ఒపీనియన్ | 39 | 44 | 10 |
| 11. | మిషన్ చాణక్య | 39.43 | 41.6 | 18.97 |
| 12. | హెచ్ఎంఆర్ | 48.3 | 43.18 | 5.84 |
| 13 | [illegible] | 42.5 | 41.5 | 11.5 |

# వినోద్ కాంబ్లీ వీడియో వైరల్

### అభిమానుల్లో ఆందోళన

ఒకప్పుడు మైదానంలో బ్యాట్ ఝుళిపించి బౌలర్లకు చుక్కలు చూపించిన భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఇప్పుడు ఓ భావోద్వేగ వీడియోతో మరోసారి వార్తల్లో నిలిచారు. వృద్ధాశ్రమం నుంచి కాంబ్లీ స్వయంగా షేర్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం చికిత్స పొందుతున్నానని చెప్పిన కాంబ్లీ.. అక్కడి సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని, ఇంటికి దూరంగా ఉన్న భావన కలగడం లేదని, తనపై ఎంతో ప్రేమాభిమానాలు చూపిస్తున్నారని తెలిపారు. అయితే మాట్లాడే సమయంలో ఆయన తడబడటం అభిమానులను కలవరపెట్టింది. ఒకప్పుడు భారత క్రికెట్ లో అత్యంత ప్రతిభావంతమైన బ్యాటర్లలో ఒకరిగా ప్రశంసలు అందుకున్న కాంబ్లీ కెరీర్ అనుకున్న స్థాయిలో సాగలేదు. భారత్ తరఫున 17 టెస్టుల్లో 1,084 పరుగులు, 104 వన్డేల్లో 2,477 పరుగులు సాధించారు. 1980ల చివర్లో, 1990ల ఆరంభంలో సచిన్ టెండూల్కర్‌తో కలిసి ఎదిగిన కాంబ్లీపై అప్పట్లో భారీ అంచనాలు ఉండేవి. అయితే సచిన్ 24 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌తో ప్రపంచ క్రికెట్ లో చెరగని ముద్ర వేయగా, కాంబ్లీ అంతర్జాతీయ ప్రయాణం తొమ్మిదేళ్లకే ముగిసింది. సచిన్ 200 టెస్టుల్లో 15,921 పరుగులు, 51 సెంచరీలు సాధించి, టెస్టులు, వన్డేల్లో అత్యధిక శతకాల రికార్డులు సొంతం చేసుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్ లో 34,357 పరుగులతో చరిత్రలోనే అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచారు. కాంబ్లీ తాజా వీడియోతో గత జ్ఞాపకాలు మళ్లీ తెరపైకి రావడంతో అభిమానులు భావోద్వేగానికి గురవుతున్నారు.





# కోహ్లీ బాంబ్‌షెల్

### 2027 చివరి ప్రపంచకప్!

దశాబ్దానికి పైగా ప్రపంచ క్రికెట్‌ను తన బ్యాట్‌తో శాసించిన విరాట్ కోహ్లీ మరో మహా సమరానికి సిద్ధమవుతున్నాడు. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ తనకు భారత్ తరఫున చివరి వరల్డ్‌కప్ అని కోహ్లీ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచంలో సంచలనంగా మారాయి. ఆదివారం వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న కొత్త హోమ్ సీజన్‌కు ముందు జియోస్టార్‌తో మాట్లాడిన కోహ్లీ.. 50 ఓవర్ల ప్రపంచకప్ తీవ్రత మరే టోర్నీకి ఉండదని చెప్పాడు. పది మ్యాచ్‌ల్లో టీ20 స్థాయి ఉత్కంఠను కొనసాగించడంతో పాటు విదేశీ పరిస్థితుల్లో ఆ స్థాయి ఒత్తిడిని తట్టుకోవడం పెద్ద సవాలని వివరించాడు. అయితే తన ముందున్న లక్ష్యం ఒక్కటేనని స్పష్టం చేశాడు—ప్రపంచకప్‌ను గెలవడం! “ఇదే నా చివరి ప్రపంచకప్. అందుకే నా దగ్గర ఉన్నదంతా ఇవ్వాలి. టైటిల్ గెలవడానికి ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నా” అంటూ కోహ్లీ తన సంకల్పాన్ని చాటాడు. ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటికే తనదైన ముద్ర వేసిన కింగ్ కోహ్లీ 37 మ్యాచ్‌ల్లో 1,795 పరుగులు, 59.83 సగటుతో ఐదు సెంచరీలు, 12 అర్ధసెంచరీలు నమోదు చేశాడు. వన్డే కెరీర్‌లో 302 ఇన్నింగ్స్‌ల్లో 14,941 పరుగులు, 54 శతకాలు, 79 అర్ధశతకాలతో 58.59 సగటు సాధించాడు. టీ20 ప్రపంచకప్‌లోనూ 35 మ్యాచ్‌ల్లో 1,292 పరుగులు, 58.73 సగటుతో దుమ్మురేపాడు. టోర్నీలో అత్యధికంగా 15 అర్ధసెంచరీలు సాధించిన కోహ్లీ 2014, 2016లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. ఇప్పుడు 2027 మిషన్ మొదలైంది!

# ఫోకస్ అంతా 2027 వరల్డ్ కప్ మీదే

### స్పష్టం చేసిన హిట్‌మెన్ రోహిత్

వయసు పెరిగినా.. లక్ష్యం మాత్రం తగ్గలేదు! వన్డే క్రికెట్ లో తన ప్రయాణం ఇంకా ముగియలేదని టీమిండియా స్టార్ రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన హిట్‌మ్యాన్.. 2027 వన్డే ప్రపంచకప్‌పై కన్నేశాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ముందు మాట్లాడిన రోహిత్.. “నేను ఆడుతున్నంతకాలం చేయాల్సిన పని పూర్తయిందనే ఆలోచన రాదు. ఎప్పుడూ ఏదో ఒక లక్ష్యం ముందుంటుంది” అంటూ తన దూకుడును చాటాడు. 2027 ప్రపంచకప్ తనకు మరో ప్రత్యేక సవాల్ అని పేర్కొన్నాడు. విభిన్న ప్రత్యర్థులు, వేర్వేరు మైదానాలు, భిన్నమైన పరిస్థితులు.. ప్రతిసారీ కొత్తగా సిద్ధం కావాల్సిందేనని చెప్పాడు. 2007, 2024 టీ20 ప్రపంచకప్‌లను భారత్‌తో గెలిచిన రోహిత్.. వన్డే ప్రపంచకప్ ట్రోఫీని మాత్రం అందుకోలేకపోయాడు. 2023లో కెప్టెన్‌గా ఫైనల్ చేరినా ఆస్ట్రేలియా చేతిలో ఓటమి ఎదురైంది. ఇప్పుడు 2027లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న ప్రపంచకప్ రోహిత్‌కు మరో అవకాశం. 288 వన్డేల్లో 11,895 పరుగులు, 34 సెంచరీలు, 62 అర్ధసెంచరీలు సాధించిన హిట్‌మ్యాన్.. 264 పరుగులతో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును కూడా తన పేరిట ఉంచుకున్నాడు. మూడు డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా నిలిచిన రోహిత్.. ఇప్పుడు ‘అసంపూర్తి పని’ పూర్తి చేసేందుకు 2027 వైపు అడుగులు వేస్తున్నాడు.





# కోహ్లీ, రోహిత్ వెళ్లినా క్రేజ్ తగ్గదు!

భారత క్రికెట్ లో దిగ్గజాల వీడ్కోలు కొత్త చర్చకు తెరతీసినా.. అభిమానుల జోష్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ స్పష్టం చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ టెస్టులకు గుడ్‌బై చెప్పడంతో జట్టులో భారీ ఖాళీ ఏర్పడిందన్న వాదనల మధ్య.. క్రికెట్‌పై ఆసక్తి తగ్గిందనడం సరైంది కాదని సెహ్వాగ్ పేర్కొన్నాడు. ఒకప్పుడు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, సచిన్ టెండూల్కర్ విషయంలోనూ “వాళ్ల కోసమే క్రికెట్ చూస్తున్నాం” అనే మాటలు వినిపించాయని గుర్తుచేశాడు. అయితే ఆ దిగ్గజాలు రిటైర్ అయినా క్రికెట్ ఆదరణ కొనసాగిందని చెప్పాడు. ఇప్పుడు పరిస్థితి మరింత మారిందని, గతంలో టీవీకే పరిమితమైన మ్యాచ్‌లు ప్రస్తుతం మొబైల్ ఫోన్లలో ఎక్కడైనా, ఎప్పుడైనా అందుబాటులోకి రావడంతో మరింత మంది క్రికెట్ చూస్తున్నారని వివరించాడు. తన రిటైర్మెంట్ తర్వాత కూడా “మీరు ఆడటం మానేశారు కాబట్టి మేమూ క్రికెట్ చూడటం మానేశాం” అని కొందరు చెప్పినప్పటికీ, అలాంటి మాటలను తాను నమ్మలేదని సెహ్వాగ్ తెలిపాడు. “క్రికెటర్ల వల్లే ఆట నడుస్తుంటే.. ఇప్పటికి క్రికెట్ ఆగిపోయేది” అంటూ తనదైన శైలిలో చెప్పిన సెహ్వాగ్.. ఆటపై అభిమానుల ప్రేమ ఏ ఒక్క స్టార్‌తోనూ ముగియదని స్పష్టం చేశాడు. కోహ్లీ, రోహిత్ తర్వాత శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా కొత్త అధ్యాయాన్ని నడిపిస్తున్నా.. క్రికెట్ జోష్ మాత్రం అదే వేగంతో కొనసాగుతోందన్నదే సెహ్వాగ్ మాటల సారాంశం.

# పారడైజ్‌కు బీఆర్ఎస్ బూస్ట్

### కేటీఆర్ థియేటర్ ఎంట్రీతో ట్విస్ట్

నాని కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ‘పారడైజ్’ సెప్టెంబర్ 24న థియేటర్లలోకి వచ్చి తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా మంచి ఓపెనింగ్స్ రాబట్టింది. అయితే మిశ్రమ స్పందనల నేపథ్యంలో రెండో రోజు కలెక్షన్లలో కొంత ప్రభావం కనిపించినా.. సినిమాలోని ఓ కీలక అంశం ఇప్పుడు దీనికి కొత్త బజ్ తీసుకొస్తోంది. కథ ద్వితీయార్థంలో మాజీ సీఎం కేసీఆర్‌ను పోలిన పాత్రకు గణనీయమైన ప్రాధాన్యం ఉండటంతో పాటు.. సీనియర్ ఎన్టీఆర్ ప్రస్తావన కూడా ఉండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా కేసీఆర్ పాత్ర చుట్టూ సాగిన అంశం బీఆర్ఎస్ వర్గాల్లో ‘పారడైజ్’పై ప్రత్యేక క్యూరియాసిటీని తీసుకొచ్చింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా థియేటర్‌కు వెళ్లి సినిమా చూడటం.. మీడియాలో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. చాలాకాలం తర్వాత కేటీఆర్ థియేటర్‌కు రావడంతో కొత్త చర్చ మొదలైంది. ఇప్పటికే తెలంగాణలో ‘పారడైజ్’కు ఇతర కీలక ప్రాంతాలతో పోలిస్తే మంచి స్పందన కనిపిస్తుండగా.. కేటీఆర్ థియేటర్ ఎంట్రీతో బీఆర్ఎస్ అభిమానుల్లో సినిమా చూడాలన్న ఉత్సాహం మరింత పెరగొచ్చన్న భావన ఉంది.



# చూపులతోనే విక్కీ షాక్!

### లవ్ అండ్ వార్‌లో రఫ్ లుక్

### బాలీవుడ్‌లో కొత్త ఫైర్

సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం ‘లవ్ అండ్ వార్’పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రణ్‌బీర్ కపూర్, అలియా భట్ ఫస్ట్ లుక్స్ ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచగా.. తాజాగా విక్కీ కౌశల్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలై సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. పోస్టర్‌లో సిగరెట్, లైటర్ చేతిలో పట్టుకుని.. ఎవ్వరినీ లెక్క చేయనట్టుగా కనిపించే విక్కీ ఇంటెన్స్ చూపు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. రఫ్ అండ్ రగ్డ్ అవతార్‌లో ఆయన కనిపించిన తీరు అభిమానులను ఫిదా చేస్తోంది. అయితే విక్కీ పాత్ర ఏంటి? కథలో ఆయన స్థానం ఏమిటి? అన్నది మాత్రం మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. రణ్‌బీర్ పోస్టర్‌లో బ్లూ కారులో రక్తంతో తడిసిన షర్ట్‌తో కనిపించగా.. అలియా క్యాబరే తరహా గ్లామరస్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఈ మూడు లుక్స్ సినిమాకు ప్రత్యేకమైన విజువల్ ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నాయి. 2027 జనవరి 21న హిందీ, తమిళం, తెలుగులో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రంపై అభిమానుల్లో అప్పుడే భారీ అంచనాలు మొదలయ్యాయి.



# ఆవేశం రీమేక్‌లో బాలయ్య?

- ఒక్క మాటతో టాలీవుడ్‌లో కొత్త చర్చ
- మాస్ ఇమేజ్‌కు ‘ఆవేశం’ సరిపోతుందా?

బాలయ్యతో ‘ఆవేశం’ రీమేక్ అంటే.. థియేటర్లలో మాస్ జాతరేనా? మలయాళ స్టార్ ఫహాద్ ఫాజిల్ నటించిన సూపర్‌హిట్ చిత్రం ‘ఆవేశం’ తెలుగు రీమేక్‌పై కొంతకాలంగా వినిపిస్తున్న వార్తలకు నిర్మాత ఎస్ఎస్ కార్తికేయ మాటలు మరింత ఆసక్తి పెంచాయి. ‘వారణాసి’ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్న కార్తికేయ.. ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ విడుదల సందర్భంగా మాట్లాడిన సమయంలో బాలకృష్ణ ఈ పాత్రకు ఎలా ఉంటారన్న ప్రశ్నకు స్పందించారు. బాలయ్య ఈ పాత్రకు బాగా సరిపోతారని, ఆయనతో రీమేక్ చేస్తే సినిమా వర్కవుట్ అయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే బాలకృష్ణను ఈ ప్రాజెక్ట్ కోసం తాను సంప్రదించలేదని స్పష్టం చేశారు. రీమేక్ గురించి తానూ విన్నానని మాత్రమే తెలిపారు. అసలు బాలయ్యతో ఈ సినిమాను తెరకెక్కించే ఆలోచన ఉందా అని నేరుగా ప్రశ్నించగా.. కార్తికేయ సమాధానం చెప్పకుండా చిరునవ్వుతోనే స్పందించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దీంతో బాలయ్య అభిమానుల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఇప్పటివరకు ‘ఆవేశం’ తెలుగు రీమేక్, బాలకృష్ణ నటనపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.





# హైదరాబాద్‌లో మరో మెగా మల్టీప్లెక్స్

### సంక్రాంతి 2027కి గ్రాండ్ ఎంట్రీ

### చిరు అభిమానులకు డబుల్ ట్రీట్

సినిమా లవర్స్‌కు హైదరాబాద్‌లో మరో బిగ్ సర్‌ప్రైజ్ సిద్ధమవుతోంది! ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీన్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చే మెగా ప్రాజెక్ట్‌తో ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి-ఏషియన్ సినిమాస్ జోడీ సినీ అభిమానుల్లో భారీ అంచనాలు పెంచింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిర్మించనున్న ఆ వరల్డ్ క్లాస్ స్క్రీన్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న వేళ.. ఈలోపే మరో అదిరిపోయే మల్టీప్లెక్స్‌కు రంగం సిద్ధమవుతోంది. ఏషియన్ మెగాస్టార్ సినీప్లెక్స్ పేరుతో కొత్త థియేటర్‌ను సంక్రాంతి 2027 సందర్భంగా గ్రాండ్‌గా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీన్ నిర్మాణానికి మరికొంత సమయం పట్టే నేపథ్యంలో ఈ కొత్త మల్టీప్లెక్స్‌ను ముందుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కుషాయిగూడలోని తల్లూరి థియేటర్స్‌ను ఏషియన్ సినిమాస్-మెగాస్టార్ భాగస్వామ్యం తీసుకుని, వాటిని ఆధునిక హంగులతో పూర్తిగా రీమోడల్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మెగాస్టార్ పేరు, ఏషియన్ సినిమాస్ బ్రాండ్ కలిస్తే థియేటర్ అనుభవం ఏ రేంజ్‌లో ఉంటుందోనని సినీ ప్రియుల్లో అప్పుడే ఉత్కంఠ మొదలైంది. చిరు ఫ్యాన్స్‌కు థియేటర్ ట్రీట్.. హైదరాబాద్ సినీ ప్రేక్షకులకు మరో కొత్త సెలబ్రేషన్!




# కల్కి 2లో దీపిక స్థానంలో ఎవరు?

### ఒక్క మాటతో సస్పెన్స్‌కు నాగ్ అశ్విన్ తెర!

కల్కి 2లో దీపిక పాత్ర ఏం కానుంది? ‘కల్కి 2898 ఏడీ’తో ఇండియన్ సైన్స్ ఫిక్షన్ సినిమాకు కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసిన నాగ్ అశ్విన్.. సీక్వెల్‌పై మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ ఇచ్చారు. దీపికా పదుకొణె సీక్వెల్‌లో ఉండరని వైజయంతీ మూవీస్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో.. ఆమె స్థానంలో కొత్త నటిని తీసుకుంటారా అన్న ప్రశ్నకు దర్శకుడు క్లారిటీ ఇచ్చారు. ‘కల్కి 2’లో కొత్తగా ఎలాంటి నటీనటుల చేరిక ఉండదని, ఇప్పటికే కథలో పాత్రలు భారీగా ఉన్నాయని నాగ్ అశ్విన్ తెలిపారు. దీంతో దీపిక పోషించిన సుమతి పాత్ర భవిష్యత్తుపై ఆసక్తి మరింత పెరిగింది. సుమతి గర్భంలో ఉన్న కల్కి కథకు కీలకమైన నేపథ్యం కావడంతో.. ఆమె పాత్రను ఎలా కొనసాగిస్తారన్నది ఇప్పుడు అసలు సస్పెన్స్‌గా మారింది. దీపిక స్థానంలో సాయి పల్లవిని తీసుకుంటారన్న వార్తలు గతంలో వినిపించినా.. దర్శకుడి తాజా వ్యాఖ్యలతో ఆ ఊహాగానాలకు మరింత ట్విస్ట్ వచ్చింది. ఇక షూటింగ్ అక్టోబర్ మధ్య నుంచి రెగ్యులర్‌గా ప్రారంభం కానుందని, ప్రభాస్ కాల్‌షీట్లు కూడా సెట్ అయ్యాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. వచ్చే ఏడాది మధ్య నాటికి షూటింగ్ పూర్తి చేసి పోస్ట్ ప్రొడక్షన్‌కు వెళ్లాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. రిలీజ్ డేట్ మాత్రం షూటింగ్ పూర్తయ్యాకే ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.